నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
బుధవారం | డిసెంబర్ 11, 2024 | www.navatelangana.com

ఆటో బోల్తా

• ఇద్దరి పరిస్థితి విషమం.. 18 మందికి గాయాలు

నవతెలంగాణ-గాంధారి



ఆటో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండగా.. 18 మందికి గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని సీతాయిపల్లి గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు టాటా ఏసీలో సీతాయిపల్లి నుంచి మోతే గ్రామానికి వెళ్తుండగా మార్గమధ్యంలో టాటా ఏసీ ప్రమాదవశాత్తు బోల్తాపడింది. ఇద్దరికి తీవ్రగాయాలు కావడంతో పరిస్థితి విషమంగా మారింది. మరో 18 మందికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు 108 ఎఎంటి కమలాకర్, పైలట్ ప్రకాష్‌గౌడ్ తెలిపారు.

వామ్మో దుమ్ము

నవతెలంగాణ-వర్ని

చందూర్ మండల కేంద్రంలో మొర్రం టిప్పర్ల వేగం ప్రయాణంతో దారి పొడవునా దుమ్ము లేస్తోంది. ఆ దుమ్ము ఇండ్లల్లోకి చేరి స్థానికులు అనారోగ్యాలకు గురవుతున్నారు. అలాగే రోడ్డు సైతం దెబ్బతింటోందని అంటున్నారు. ఇప్పటికే చందూర్ నుంచి లక్ష్మాపూర్ వరకు తారు రోడ్డు గుంతలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విచ్చలవిడిగా గత మూడు రోజుల నుంచి మొరం టిప్పర్లు వేగంగా వెళ్లడంతో ప్రజలు భయపడుతున్నారు. స్థానిక అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు.



లారీలు ప్రయాణించే సమయంలో దుమ్ము

ఆశావర్కర్ల అరెస్ట్

హైదరాబాద్ ఆందోళనకు వెళ్లనీయకుండా అడ్డగింత.. పోలీస్‌స్టేషన్‌లకు తరలింపు

నవతెలంగాణ-విలేకరుల బృందం

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆశా వర్కర్లకు పనికి తగ్గ జీతం రూ.18 వేలు ఇస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వెంటనే నెరవేర్చాలని కోరుతూ హైదరాబాద్ కోఠిలోని డిఎంహెచ్ఎస్ కార్యాలయం ముందు చేపట్టే ఆందోళన కార్యక్రమానికి ఉమ్మడి జిల్లాలోని ఆశావర్కర్లను వెళ్ళనీయకుండా పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు.

బిచ్కుంద : మండలంలోని ఆశావర్కర్లను, సిఐటియు నాయకులను పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆశావర్కర్ల మండలాధ్యక్షురాలు అనిత మాట్లాడుతూ.. ఎన్నికలలో ఆశావర్కర్లకు రూ.18వేల జీతం చెల్లిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిందని సంవత్సరం దాటినా తమ హామీలను నెరవేర్చకపోవడంతో ఆందోళన కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు. ఉదయాన్నే ఆశావర్కర్ల ఇంటికి పోలీసులు వచ్చి అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించడం అమానవీయమైన చర్య అని ఆవేదన వ్యక్తం చేశారు. చాలీచాలని వేతనాలతో పని చేస్తున్న తమకు తమ డిమాండ్ల కోసం పోరాటాలు చేస్తుంటే ప్రభుత్వం ఆశావర్కర్లపై దౌర్జన్యాలకు దిగడం సమంజసం కాదని అన్నారు. తమ డిమాండ్లు నెరవేరేవరకు ఉద్యమాలు కొనసాగిస్తామని ఆమె అన్నారు. సిఐటియు నాయకులు సురేష్ గొండ, ఆశా కార్యకర్తలు శోభ, లక్ష్మి అరుణ, చంద్రకళ, లక్ష్మి, సునీత ఆశాకార్యకర్తలు ఉన్నారు.

రెంజల్ : సంవత్సరాలుగా చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న తమకు గౌరవప్రదమైన వేతనాలు చెల్లించాలని, రాష్ట్రస్థాయి యూనియన్ పిలుపుమేరకు హైదరాబాద్‌లో తలపెట్టిన ధర్నాకు వెళ్లకుండా ముందు జాగ్రత్తగా ఆశావర్కర్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పగలు రాత్రి తేడా లేకుండా ప్రజలకు సేవలను అందిస్తున్న తమకు రూ.18 వేల వేతనం చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. ఆశావర్కర్ల మండల అధ్యక్షురాలు లావణ్య, సుజాత, స్రవంతి, సుమతి తదితరులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.



ఆశావర్కర్లను అరెస్టు చేయడం సిగ్గుచేటు

బోధన్ : తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని చలో హైదరాబాద్‌కు వెళుతున్న ఆశావర్కర్లను అక్రమంగా అరెస్టు చేయడం సిగ్గుచేటని సిఐటియూ జిల్లా అధ్యక్షులు శంకర్ గౌడ్ అన్నారు. తమ వేతనాలు పెరుగుదల కోసం, ఉద్యోగ భద్రత కోసం ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని బోధన్ రైలుకు వెళుతున్న ఆశా వర్కర్లను పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి బోధన్ పోలీస్ స్టేషన్ కు తరలించారని తెలిపారు. గత ప్రభుత్వం వలే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఉద్యమాలను అణచివేయడం చూస్తే ప్రజా పరిపాలన ఏ విధంగా ఉందో అర్థమవుతుందన్నారు. వెంటనే ఆశావర్కర్ల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే రాబోయే కాలంలో పోరాటాలను ఉధృతం చేస్తామని, అందుకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విజయలక్ష్మి, సుజాత, కల్పన, రమణి, రమ, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

జుక్కల్ : మండలంలోని ఆశా కార్యకర్తలు తమ డిమాండ్ల కొరకు చలో హైదరాబాద్ నిర్వహించడంతో జుక్కల్ పోలీసులు ముందస్తుగా ఆశా కార్యకర్తలను, సిఐటియు జిల్లా నాయకుడు సురేష్ గొండను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సురేష్ గొండ మాట్లాడుతూ.. పోలీసులు ఉద్యమాలను అణిచివేస్తే రాబోయే రోజులలో ప్రత్యక్ష యుద్ధం చేయాల్సి వస్తుందన్నారు.



బిచ్కుందలో..



రెంజల్‌లో..



బోధన్‌లో..

12న అంగన్వాడీల చలో హైదరాబాద్

• జయప్రదం చేయండి

• సీఐటీయూ పిలుపు

నవతెలంగాణ-కంఠేశ్వర్

అంగన్వాడీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు డిసెంబర్ 12న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ పిలుపునిచ్చింది. అందులో భాగంగా జిల్లాలోని అంగన్వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొనాలని నిర్ణయించిందని తమ సమస్యల పరిష్కారం కోసం జరిగే చలో హైదరాబాద్‌ను జయప్రదం చేయటానికి సహకరించాలని టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఐసిడిఎస్ పిడి కార్యాలయంలో సూపరింటెండెంట్‌కు వినతిపత్రాన్ని మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు ఏ రమేష్ బాబు మాట్లాడుతూ.. అంగన్వాడీ టీచర్లకు కనీస వేతనాలు నెలకు రూ.26,000 ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, బెనిఫిట్స్‌ను, టీచర్‌కు రూ.5లక్షలు, ఆయాకు రూ.3లక్షలు ఇవ్వాలని, రిటైర్ అయిన వారికి జీతంలో సగం పెన్షన్ సౌకర్యాన్ని కల్పించాలన్నారు. ఇప్పటికే అనేకమార్లు ప్రభుత్వానికి విన్నవించుకున్నప్పటికీ గత బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అంగన్వాడీ ఉద్యోగుల సమస్యలను పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చి ఓట్లు వేయించుకొని అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తయినప్పటికీ అంగన్వాడీల సమస్యలు పరిష్కరించలేదన్నారు. 60 సంవత్సరాలు నిండిన అంగన్వాడీ టీచర్లను రిటైర్మెంట్ ప్రకటించి ఆరు నెలలు అవుతున్నప్పటికీ వారికి ఎటువంటి రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ ఇవ్వకుండా వారందరినీ ఇంటికి పంపించడంతో ఆదాయం లేక అనేకమంది అంగన్వాడీ ఉద్యోగులు అనారోగ్యాల పాలై ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. సుప్రీంకోర్టు అంగన్వాడీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించి గ్రాటివిటీ పెన్షన్ ఇవ్వాలని ఆదేశించినప్పటికీ అవేవీ ఖాతరు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో ఈ అసెంబ్లీ సమావేశాల్లోనైనా అంగన్వాడీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని చలో హైదరాబాద్‌కు పిలుపునిచ్చినట్టు తెలిపారు. జిల్లాలోని అంగన్వాడీ టీచర్లు, ఆయాలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అందుకు అధికారులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి పి.స్వర్ణ, నాయకులు సందీప, సాజిదా, కవిత, సవిత తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

పశుగణన వేగం పెంచాలి

• జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి జగన్నాథచారి

నవతెలంగాణ-ఎడపల్లి

పశుగణన వేగం పెంచాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి జగన్నాథచారి తెలిపారు. మంగళవారం ఎడపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక పశువైద్యశాలలో బోధన్ నియోజకవర్గంలో పశువైద్య కేంద్రాలలో పనిచేస్తున్న ఉద్యోగుల సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ జగన్నాథచారి మాట్లాడుతూ.. జిల్లాలో ఇప్పటివరకు చేపట్టిన పశుగణన వివరాలను మండలాల వారీగా సమీక్షించారు. పీపీఆర్, అలాగే సీఎస్ఎఫ్ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డీఆర్.గంగాధరయ్య, డీఆర్.మజీద్, డీఆర్ రోహిత్‌రెడ్డి, డీఆర్ బస్వారెడ్డి, బోధన్, రెంజల్, నవీపేట్, ఎడపల్లి పశు వైద్యాధికారులు పాల్గొన్నారు.



మద్నూర్‌కు కేంద్రీయ విద్యాలయం

• హర్షం వ్యక్తం చేస్తున్న మండల ప్రజలు

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ మండల కేంద్రానికి కేంద్రీయ విద్యాలయం మంజూరు అయినట్లు కామారెడ్డి జిల్లా విద్యాశాఖ అధికారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్రీయ విద్యాలయానికి నూతన భవన నిర్మాణం కోసం మద్నూర్ గ్రామ శివారు పరిధిలోని 499/2/1 ఈ సర్వే నంబర్లో 10 ఎకరాల 9 గుంటల భూమి ప్రభుత్వానికి చూయించినట్లు పేర్కొన్నారు.

నేడు ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేకం

మద్నూర్ మండలానికి కేంద్రీయ విద్యాలయం మంజూరైనందున బుధవారం ఉదయం 11 గంటలకు మద్నూర్ మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ కార్యాలయంలో జుక్కల్ శాసనసభ్యులు తోట లక్ష్మీకాంతరావు చిత్రపటానికి పాలాభిషేకం చేయనున్నట్టు కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు ధరాస్ సాయిలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఆపదలో రక్తదానం.. అభినందనీయం

• జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

నవతెలంగాణ-కామారెడ్డి

ఆపద సమయంలో రక్తదానం చేయడం అభినందనీయమనీ జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా ట్రెజరీ శాఖ అధికారులు, సిబ్బంది రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఆపద సమయంలో మరొకరికి రక్తం అవసరమని, అలాంటి రక్తదానం చేయడం మరొకరికి ప్రాణదానం చేసినవారవుతారని అన్నారు. ఇలాంటి శిబిరాలను నిర్వహించాలని కలెక్టర్ కోరారు. జిల్లా కోశాధికారి కార్యాలయం సిబ్బంది రక్తదానం చేయడం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ ఏం.రాజన్న, జిల్లా కోశాధికారి వెంకటేశ్వర్లు, టీ.ఎన్.జి.ఒ. అధ్యక్షులు వెంకట్ రెడ్డి, ఎస్.టీ.ఒ. సాయిరెడ్డి, రెడ్‌క్రాస్ ప్రతినిధులు డాక్టర్ దేవేందర్, డాక్టర్ పి.వి.నరసింహం, ట్రెజరీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఈవీఎం గోదాంను పరిశీలించిన జిల్లా కలెక్టర్..

ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈవీఎం గోదాంను పరిశీలించినట్టు జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తెలిపారు. స్థానిక ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ గోదాంను పరిశీలించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల గోదామును వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పరిశీలించినట్టు కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవిన్యూ) వి.విక్టర్, ఆర్డీఓ రంగనాథ్ రావు, కామారెడ్డి తహసీల్దార్ జనార్ధన్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

కల్లానికి వెళ్లే దారికి అటవీశాఖ అధికారుల అడ్డు

• గుంతలు తవ్వి బోర్డు ఏర్పాటు

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని ముస్తాపూర్ గ్రామ సమీపంలో మంగళవారం మధ్యాహ్నం వద్ద కల్లానికి వెళ్లే దారిని అటవీశాఖ అధికారులు గుంతలు తవ్వి బోర్డు ఏర్పాటు చేశారు. మండలంలోని ముస్తాపూర్ గ్రామంలో రైతులు గ్రామ సమీపంలోని అటవీకి ఆనుకొని ఉన్న కల్లం వద్ద వడ్లు ఆరబోశారు. దారికి అడ్డంగా ఫారెస్ట్ అధికారులు గొయ్యి తవ్వారు. ఇదేంటని రైతులు ప్రశ్నిస్తే ఫారెస్ట్ అధికారులు పొంతనలేని సమాధానాలు చెబుతున్నారని రైతులు అంటున్నారు.

ఆలయ ప్రాంగణంలో మరమ్మతులు

నవతెలంగాణ-తాడ్వాయి

మండల కేంద్రంలోని శబరిమాత ఆలయ సమీపంలో మంగళవారం నుంచి మరమ్మతులు చేపట్టారు. ఈనెల 15, 16 తేదీల్లో జరిగే దత్తాత్రేయ ఉత్సవాల్లో భాగంగా శ్రీ శబరిమాత ఉత్సవాలకు హైదరాబాద్, కరీంనగర్, బీదర్, నాందేడ్ జిల్లాల నుంచి వచ్చే భక్తుల సౌకర్యం కోసం రోడ్లను జేసీబీ సహాయంతో చదును చేస్తున్నారు. గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు మేకల రాజు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అంబీర్ శ్యాంరావు ఆధ్వర్యంలో పనులు చేపడుతున్నారు.

ఇంటింటికీ సీపీఐ(ఎం) కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

• సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్

నవతెలంగాణ-కామారెడ్డి

ఇంటింటికీ సీపీఐ(ఎం) కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం కామారెడ్డి పట్టణంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ.. జనవరి 25, 26, 27, 28 తేదీలలో సంగారెడ్డి జిల్లా కేంద్రంలో సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభలు జరుగుతున్న సందర్భాన్ని పురస్కరించుకొని, ఈనెల 13 నుంచి ప్రారంభమయ్యే ఇంటింటికి సీపీఐ(ఎం) కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడానికి 13న కామారెడ్డి జిల్లా కేంద్రానికి సీపీఐ(ఎం) మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి వస్తున్నారన్నారు. కావున జిల్లాలోని శాఖ కార్యదర్శులు, జిల్లా కమిటీ సభ్యులందరూ 13వ తేదీన జిల్లా కేంద్రానికి రావాలని జిల్లా కేంద్రంలో జరిగే ఇంటింటికి సీపీఐ(ఎం) కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కామారెడ్డి జిల్లాలో రైతాంగ ఉద్యమాలు, కార్మిక ఉద్యమాలు, భూమి, ఇంటి స్థలాల సమస్యలు, రేషన్ కార్డులో పెన్షన్లు, అలాగే కార్మిక సమస్యలు, దాంట్లో ప్రధానంగా బీడీ కార్మిక సమస్యలు, రైతు, వ్యవసాయ, కార్మిక, విద్యార్థి, యువజన, మహిళా సమస్యలు పరిష్కారానికి జిల్లా అభివృద్ధికి ఎన్నో ఉద్యమాలు నిర్వహించి సీపీఐ(ఎం) ప్రజల పక్షాన నిలబడిందన్నారు. పెట్టుబడిదారుల యజమానుల డబ్బులు సీపీఐ(ఎం) తీసుకోదని, సీపీఐ(ఎం) ప్రజల పార్టీ అయినందున కార్యక్రమాల నిర్వహణ కోసం ప్రజల వద్దకు వస్తున్నదని తెలిపారు. కావున కామారెడ్డి జిల్లా ప్రజలు పార్టీని ఆదరించి ఆర్థిక సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వెంకట్‌గౌడ్, కొత్త నరసింహులు, జిల్లా కమిటీ సభ్యులు ముదాం అరుణ్, కందూరి రేణుక, నర్సింలు, సత్యం, నారాయణ, బాలరాజు, హైమద్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లడుతున్న చంద్రశేఖర్..

ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

• మాజీ ఎమ్మెల్యే హనుమంతు షిండే

నవతెలంగాణ-బిచ్కుంద/సదాశివనగర్

ఎన్నికల్లో ఇచ్చిన ఆరు హామీలను నెరవేర్చలేని స్థితిలో ఉన్న ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తారని ఆలోచనతో ప్రజల ఆలోచనలను డైవర్ట్ చేసి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హనుమంత్ షిండే అన్నారు. మంగళవారం బిచ్కుంద మండల కేంద్రంలోని అమరవీరుల స్తూపానికి నివాళులర్పించి తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే హనుమంత్ షిండే మాట్లాడుతూ 2007లో మేధావులు తెలంగాణ ఉద్యమకారులు అందరి సమష్టితో తెలంగాణ తల్లి విగ్రహ రూపకల్పన జరిగిందని ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం సంవత్సరం పాలనలో విజయోత్సవాల పేరుతో తెలంగాణ తల్లి విగ్రహానికి అపచారం చేసిందని ఆరోపించారు. ఇచ్చిన హామీలు నెరవేర్చలేదన్నారు. 100 శాతం రుణమాఫీ చేశామని చెబుతూ రైతులను నట్టేట ముంచిందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షులు వెంకటరావు దేశాయ్, రైతు సహకార సంఘం అధ్యక్షులు శ్రీహరి బాలాజీ, నాయకులు రాజు, రామచందర్, సంజు పటేల్, డాక్టర్ రాజు, మల్లికార్జున్ పటేల్, నాయకులు కార్యకర్తలున్నారు.

సదాశివనగర్ :

మండలంలోని వజ్జెపల్లి తండాలో తెలంగాణ తల్లి విగ్రహానికి ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ పాలాభిషేకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ మలిదశ ఉద్యమంలో యువకులు స్వచ్ఛంధంగా తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేశారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం దొంగ హామీలతో అధికారంలోకి వచ్చిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఒక సంవత్సరం పాలనలో అభివృద్ధి శూన్యమని తెలిపారు. రైతులకు రుణమాఫీ చేయలేదని, రైతు భరోసా హామీ ప్రకారం ఇప్పటికీ ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. ఎన్నికల హామీలో ఇచ్చిన పింఛన్, నిరుద్యోగ భృతి ఇవ్వడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. 420 హామీలలో ఏ ఒక్కటి కూడా అమలు చేయలేదని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షులు బోలిపెల్లి మహేందర్‌రెడ్డి, నాయకులు శీను నాయక్, మాజీ జెడ్పీటీసీ కమిలి నర్సింలు, శివాజీ రావ్, రవీందర్‌రెడ్డి, మాజీ ఎంపిపి రాజయ్య, సాయంగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, చందర్‌రావ్, శివ పాటిల్, రవీందర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



బిచ్కుంద : పూలమాల వేస్తున్న మాజీ ఎమ్మెల్యే

నేడు, రేపు మిషన్ భగీరథ నీటి సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-నిజాంసాగర్

జుక్కల్ సెగ్మెంట్ పరిధిలోని మిషన్ భగీరథ 145 ఎంఎల్‌డి వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ ప్రధాన పిసిసిపి పైప్ లైన్ మెయింటెనెన్స్, మరమ్మతుల నిర్వహణ కారణంగా మోటార్స్ నిలిపివేయనున్నట్టు బాన్సువాడ డివిజన్ మిషన్ భగీరథ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమేష్ మంగళవారం తెలిపారు. కావున బాన్సువాడ, జుక్కల్, బోధన్, ఎల్లారెడ్డి నియోజకవర్గ పరిధిలోని గ్రామాలకు బల్క్ నీటి సరఫరాలో రెండు రోజులు (11-12-2024, 12-12-2024) అంతరాయం ఉంటుందని ఆయన తెలిపారు. కావున ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. గ్రామాల్లోని ప్రజలు గ్రామపంచాయతీ బోర్ వాటర్‌ను వాడుకోవాలని ఆయన తెలిపారు.

హెచ్ఐవీపై అవగాహన కోసం విస్తృత ప్రచారం

• జిల్లా హెచ్ఐవీ ఎయిడ్స్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ రాధిక

నవతెలంగాణ-దోమకొండ



హెచ్ఐవీ ఎయిడ్స్‌పై అవగాహన కోసం రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఇటీవల కాలంలో విస్తృత ప్రచారం చేస్తుందని జిల్లా హెచ్ఐవీ ఎయిడ్స్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ రాధిక అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో సంచార వాహనపు ఎల్ఈడి చిత్ర ప్రదర్శనతో అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. హెచ్ఐవీ వ్యాధిని నివారించడానికి అవగాహన ముఖ్యమని భావించి ప్రచార కార్యక్రమాలను ముమ్మరం చేశామన్నారు. సంచార వాహనం ద్వారా హెచ్ఐవి, ఎయిడ్స్, సుఖ వ్యాధులపై ఎల్ఈడి తెరపై ఆయా గ్రామాలలో చిత్ర ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు. అన్నివర్గాల వారు ఎల్ఈడి చిత్ర ప్రదర్శనను తిలకించి, అవగాహన కల్పించుకోవాలని కోరారు. 2030 నాటికి హెచ్ఐవీని నిర్మూలించే దిశగా అందరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ ప్రభు కిరణ్, సిహెచ్‌సి సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, ఎస్సై ఆంజనేయులు, గ్రామ కార్యదర్శి యాదగిరి, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ డీపీఎం చల్లా సుధాకర్, ఐసిటిసి కౌన్సిలర్ మేక నాగరాజు, వైఆర్‌జికేర్ లింకు వర్కర్ స్కీం డిఆర్‌పి గర్దాస్ సుధాకర్, రెడ్‌క్రాస్ సొసైటీ మండలాధ్యక్షుడు బుర్రి రవికుమార్, బిజెపి మండల అధ్యక్షుడు భూపాల్‌రెడ్డి, లింకు వర్కర్ బాలకిషన్, కమ్యూనిటీ కోఆర్డినేటర్ శ్రీవిద్య, అవుట్రిచ్ వర్కర్లు సాయి, మీనారెడ్డి, ఆటో యూనియన్ అధ్యక్షులు బొమ్మెర మహాదేవ్, దేవరగట్టు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరవధిక సమ్మె ప్రారంభం



సమ్మెలో పాల్గొన్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

నవతెలంగాణ-కామారెడ్డి

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో సమగ్ర శిక్ష ఉద్యోగులు మంగళవారం నిరవధిక సమ్మెను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ.. గత నాలుగు రోజులుగా నిరసన దీక్షలు చేసినా ప్రభుత్వం నుంచి సరైన స్పందన రాలేదన్నారు. అందులో భాగంగానే నిరవధిక సమ్మెను ప్రారంభించినట్లు తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ రాకుంటే రేపటి నుంచి సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పిఆర్‌టి తెలంగాణ అధ్యక్షులు అంబీరి మనోహర్, జిల్లా అధ్యక్షులు సత్యనారాయణ, అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి సంపత్ కుమార్, శ్రీధర్ కుమార్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సంతోష్‌రెడ్డి, నాయకులు రోటో శ్రీను, రాములు, శ్రీవాణి, మైస కల, చిరంజీవి, శ్రీకాంత్, శైలజ, కాళిదాసు, గంగాప్రసాద్, మాధవి, లింగం, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

భారత్ సేవ పురస్కారం అందజేత

నవతెలంగాణ-మోర్తాడ్

మండలం శెట్పల్లి గ్రామానికి చెందిన కరుణ టెస్ట్ సేవ సంస్థ చైర్మన్ తుమ్మల మహేష్ కుమార్‌కు భారత్ సేవ పురస్కారం అందజేసినట్లు తెలిపారు. కరుణ టెస్ట్ ఏర్పాటు చేసి ప్రజలకు అత్యుత్తమ సేవా కార్యక్రమాలు అందిస్తున్నందుకు గాను, హ్యూమన్ రైట్స్ కౌన్సిల్స్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని తెలంగాణ పరిషత్ కళాభవన్‌లో మహేష్‌కు భారత్ సేవ పురస్కారం అందించినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో అనాథలకు అండగా నిలవడానికి తాను నిరుపేదలను గుర్తించి కరుణ టెస్ట్ ద్వారా పలు సేవలందిస్తున్నందుకుగాను తనను గుర్తించి ఈ పురస్కారాన్ని అందించినందుకుగాను ఉమెన్ రైట్స్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మానవ హక్కుల కౌన్సిల్ జాతీయ చైర్మన్ కొప్పుల విజయ్ కుమార్, రాష్ట్ర చైర్మన్ నర్సింగ్, ప్రొఫెసర్ రాములు, హాయ్ గుడ్ న్యాయవాది కడాది రమేష్ పాల్గొన్నారు.


మహేష్‌కుమార్‌కు పురస్కారం అందజేత

ఆర్థిక సహాయం చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని కోనాపూర్, కొత్తచెరువు తండా గ్రామాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు బాల్కొండ శాసనసభ్యులు వేముల ప్రశాంత్ రెడ్డి చొరవతో మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి ఆర్థిక సహాయం చెక్కులను మంగళవారం అందజేశారు. గ్రామానికి చెందిన మేకల రాజం కు రూ.10వేలు, మైలారం లక్ష్మీకి రూ.12,500, బంగారి గంగారాంకు రూ.39వేలు, కట్టెకోల శృతికి రూ.19వేలు, మారంపెల్లి లావణ్యకు రూ. 19,500, శనిగరపు గణేష్ కు రూ.15వేలు, శనిగరపు మహేష్‌కు రూ.21,500, కోనాపూర్ గ్రామ పరిధిలోని వరంగట్టు తండాకు చెందిన లకావత్ హర్యకు రూ.21వేలు, కొత్తచెరువు తండాకు చెందిన లకావాత్ రవీందర్ కు రూ.13,500 విలువైన ఆర్థిక సహాయం చెక్కులు మంజూరయ్యాయి. కోనాపూర్, కొత్తచెరువు తండా గ్రామాల పరిధిలోని 9 మంది లబ్ధిదారులకు మొత్తంగా రూ.లక్ష 71వేల విలువైన చెక్కులు ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి కృషితో ప్రభుత్వం మంజూరు చేసింది. చెక్కులను స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి అందజేశారు. కార్యక్రమంలో కోనాపూర్ మాజీ సర్పంచ్ దయ్య దేవయ్య, మాజీ ఎంపీటీసీ సభ్యుడు లకావత్ గంగాధర్, రాజు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


కమ్మర్‌పల్లి: తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు


మోర్తాడ్: మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు


ఏర్గట్ల: తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

సోనియా మెప్పు కోసమే తెలంగాణ తల్లి విగ్రహం మార్పు

- **బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రేగుంట దేవేందర్**
- **తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం**

నవతెలంగాణ-విలేకరుల బృందం

కమ్మర్‌పల్లి : సోనియా గాంధీ పుట్టిన రోజు సందర్భంగా ఆమె మెప్పుకోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చడం సరైనది కాదని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రేగుంట దేవేందర్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ తల్లి విగ్రహాన్ని కాంగ్రెస్ తల్లి విగ్రహంగా మార్చడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.తారకరామారావు, మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డిల పిలుపుమేరకు మండలంలోని చౌట్ పల్లిలో మంగళవారం తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఈసందర్భంగా రేగుంట దేవేందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ తల్లి విగ్రహ రూపాన్ని మార్చడం సమంజసం కాదన్నారు. కొత్తగా ఏర్పాటు చేసిన విగ్రహంలో బతుకమ్మను లేకుండా ఆవిష్కరించడం తెలంగాణ ప్రజలకు ఎంత మాత్రం సమ్మతం కాదన్నారు. ఇది తెలంగాణ ఆడపడుచులను, తెలంగాణ సంస్కృతిని అవమానించినట్లుగా తెలంగాణ ప్రజలు భావిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సోనియా గాంధీ పుట్టిన రోజు సందర్భంగా మెప్పుకోసం తెలంగాణ తల్లిని మార్చి, తెలంగాణ తల్లి అవతరణ దినోత్సవం జరుపుకోవడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బద్దం చిన్నారెడ్డి, పెరుమాండ్ల రాజా గౌడ్, నాయకులు గడ్డం స్వామి, మైలారం సుధాకర్, దయ్య దేవయ్య, మారు శంకర్, కుంట ప్రతాప్ రెడ్డి, నవీన్ గౌడ్, కొంటి కంటి నరేందర్, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు..

మోర్తాడ్ : తెలంగాణ తల్లి పేరు చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం విగ్రహాలతో అరాచకమాడుతుందని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఏలియా అన్నారు. మంగళవారం స్థానిక తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం నిర్వహిస్తూ నిరసన తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ చరిత్ర తెలియదని అన్నారు. తక్షణమే తెలంగాణ తల్లి విగ్రహాన్ని యధావిధిగా ఉంచుతూ నూతనంగా ఏర్పాటు చేసిన విగ్రహాన్ని తొలగించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి అంటూ ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు అది కాంగ్రెస్ తల్లి అని, తెలంగాణ తల్లి విగ్రహం కాదని అన్నారు. నూతనంగా ఏర్పాటు చేసిన విగ్రహాన్ని తొలగించకపోతే రాబోయే రోజుల్లో తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెప్తారని అన్నారు. కార్యక్రమంలో మోర్తాడ్, వేల్పూర్ మండలాల పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఏర్గట్ల : మండలకేంద్రంలోని బస్టాండ్ వద్ద ఉన్న తెలంగాణ తల్లి విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులు మంగళవారం పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండలాధ్యక్షులు పూర్ణానందం, మాజీ ఎంపీపీ ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ... తెలంగాణ తల్లిని కాంగ్రెస్ తల్లిగా మార్చడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. మలిదశ ఉద్యమంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని మేధావులందరు కలిసి ప్రజల గుండెల్లో నిలిచిపోయేలా రూపకల్పన చేశారని, కానీ ఇప్పటి ప్రభుత్వం తెలంగాణ తల్లి చేతిలో ఉన్న బతుకమ్మను, ఆమె తలపై ఉన్న కిరీటాన్ని, బంగారు ఆభరణాలను లేకుండా చేశారని, ప్రజల మనోభావాలను లెక్కచేయలేదని అన్నారు. తెలంగాణ ఉద్యమం పైన రేవంత్ రెడ్డికి ఎంతటి ఉక్రోషం, ద్వేషం ఉందో, ప్రజలు గమనించకపోవడం దురదృష్టకరం అని అన్నారు. అధికారం అనేది ఈ రోజు ఉండవచ్చు , రేపు లేక పోవచ్చు గాని,ఒక నియంతలా గత పాలకుల ఆనవాళ్ళు లేకుండా చేస్తామనడం తన మూర్ఖత్వానికి నిదర్శనం అని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల తాజా మాజీ ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముప్కాల్ : మండలంలోని కొత్తపల్లి గ్రామంలో తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఈసందర్భంగా పార్టీ మండల అధ్యక్షులు ముస్కు భూమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ తల్లి విగ్రహ రూపాన్ని మార్చడం సమంజసం కాదని, కొత్తగా ఏర్పాటు అయిన విగ్రహంలో బతుకమ్మను లేకుండా ఆవిష్కరించడం సరైంది కాదని అన్నారు. ఇది తెలంగాణ మహిళ ఆడపడుచులను, తెలంగాణ సంస్కృతిని అవమానించినట్లుగా ఆవేదన వ్యక్తం చేశారు. సోనియా గాంధీ పుట్టిన రోజు సందర్భంగా సోనియాగాంధీ మెప్పుకోసం తెలంగాణ తల్లిని మార్చి, తెలంగాణ తల్లి అవతర దినోత్సవం జరుపుకోవడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ సీనియర్ నాయకులు సామ వెంకటరెడ్డి, బద్దం నర్సారెడ్డి, ఆయా గ్రామాల తాజా మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీ సభ్యులు, పార్టీ సీనియర్ నాయకులు, పార్టీ ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

మెండోర : బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు, డిసిసిబి డైరెక్టర్ నాగంపేట్.శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని బుస్సాపూర్ గ్రామంలో తెలంగాణ తల్లి విగ్రహానికి బీఆర్ఎస్

నాయకులు పాలాభిషేకం చేశారు. అనంతరం నాగంపేట్.శేఖర్ రెడ్డి మాట్లాడుతూ మేధావులు , కవులు , కళాకారులు ఎందరో కలిసి తెలంగాణ తల్లి రూపకల్పన చేసి తెలంగాణ తల్లి విగ్రహాన్ని తయారు చేశారని అన్నారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని అవమాన పరిచేలా నూతన విగ్రహాన్ని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవిష్కరించడం సిగ్గుచేటు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు కమలాకర్, మాజీ జడ్పీటిసి తలారి.గంగాధర్ , మాజీ ఎంపీటీసీలు, సర్పంచ్ లు , నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కంఠేశ్వర్ : నిన్న కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ తల్లి రూపు రేఖలు మార్చి తెలంగాణ సచివాలయం లో ప్రతిష్టించినందుకు నిరసనగా మంగళవారం బీఆర్ ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేసి పూల మాల వేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్ మాట్లాడుతూ.. ఆలిని మార్చిన దుర్మార్గులు ఉంటారు కానీ, తల్లిని మార్చిన మూర్ఖులు ప్రపంచంలో ఎక్కడా లేరని, ఎవరు అభ్యంతరం చెప్పారని తెలంగాణ తల్లి రూపాన్ని మార్చారని ప్రశ్నించారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా ప్రజల బతుకులు మారాలి తప్ప తల్లులను మార్చడం అతిపెద్ద తప్పని అన్నారు. అనంతరం నగర మేయర్ దండు నీతూ కిరణ్ మాట్లాడుతూ..బతుకమ్మను మాయం చేయడం తెలంగాణ అస్తిత్వంపై జరుగుతున్న దాడికి పరాకాష్ట అని, తెలంగాణ తల్లి ఒక పార్టీకో, వ్యక్తికో సంబంధించినది కాదు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఆస్తిత్వానికి చిహ్నాలు అయిన బతుకమ్మను, బతుకమ్మ చీరలను, బతుకమ్మ ఆటపాటలను చెరిపి, రానున్న రోజుల్లో తెలంగాణను మాయం చేసే కుట్రలకు తెగబడుతున్నదని అన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి, మాజీ జెడ్పిపి చైర్మన్ దాదన్న గారి విఠల్ రావు మాట్లాడుతూ.. తెలంగాణ విగ్రహరూప కల్పన 2007లో కొన్ని నెలల పాటు కవులు కళాకారులు మేధావులు పండితులు తో చర్చించి ఉద్యమానికి ప్రతీకగా కేసీఆర్ తెలంగాణ తల్లి విగ్రహాన్ని రూపకల్పన చేశారన్నారు. ఆ సమయంలో కేంద్రంలో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమే ఉంది కదా మరి అప్పుడు మార్చలేని విగ్రహాలను ఇప్పుడు ఎందుకు మారుస్తున్నారని, దీని వెనుక కుట్ర దాగి ఉందని అన్నారు. కార్యక్రమంలో నగర అధ్యక్షులు సిర్ప రాజు, రాష్ట్రర నాయకుల్ను రామ్ కిషన్ రావు, , మాజీ నుడా చైర్మన్ ప్రభాకర్ రెడ్డి,సుజిత్ సింగ్ ఠాకూర్ సుదాం రవి చందర్, సత్య ప్రకాష్, నవీద్ ఇక్బాల్,ప్యాట సంతోష్,మల్కాయి మహేందర్, తెలంగాణ శంకర్, శేఖర్ రాజు, మీసాల శంకర్, చింతకాయల రాజు, ఎండల ప్రసాద్, మాకు రవి, జమాల్పూర్ రమేష్, అనిల్, విజయ్, సాదిక్, తదితరులు పాల్గొన్నారు.

బాల్కొండ : కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ తల్లి విగ్రహ రూపాన్ని మార్చినందుకు నిరసనగా మండల పరిధిలోని వన్నెల్(బి) గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ తల్లి విగ్రహ రూపాన్ని మార్చినందుకు తెలంగాణ తల్లి అపవిత్రమైందని భావిస్తూ తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేశామన్నారు. సోనియా గాంధీ పుట్టిన రోజు సందర్భంగా సోనియా గాంధీ మెప్పుకోసం తెలంగాణ తల్లిని మార్చి తెలంగాణ తల్లి అవతరణ దినోత్సవం జరపాలని పేర్కొనడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు దాసరి వెంకటేష్, లింగా గౌడ్, సొసైటీ చైర్మన్ సూరజ్‌రెడ్డి, బాల్కొండ పట్టణ అధ్యక్షుడు సాగర్ యాదవ్, నోముల మోహన్, శ్రీకాంత్ యాదవ్, మండల యువజన అధ్యక్షుడు గాండ్ల రాజేష్, తదితరులు పాల్గొన్నారు.


ముప్కాల్: మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు


మెండోర: తెలంగాణ తల్లికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు


కంఠేశ్వర్: మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు


బాల్కొండ: మాట్లాడుతున్న నాయకులు

మున్సిపల్ కార్మికులను వేధిస్తున్న డిప్యూటీ కమిషనర్‌ను సస్పెండ్ చేయాలి

- **బిఎల్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్**

నవతెలంగాణ-కంఠేశ్వర్

చలిలో, వర్షంలో తడుస్తూ ఎండలను భరిస్తూ మున్సిపల్ ఔట్ సోర్సింగ్ కార్మికులు నిజామాబాద్ నగర ప్రజలకు సేవలందిస్తున్నా కూడా అవమానిస్తున్న డిప్యూటి కమిషనర్ రాజేందర్ కుమార్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని బహుజన మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ బిఎల్ టీయూ రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్ డిమాండ్ చేశారు. మంగళవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద జరిగిన ధర్నాలో మాట్లాడారు. మున్సిపల్ కార్మికులపై డిప్యూటీ కమిషనర్ వేధింపుల వల్ల రాష్ట్ర ప్రభుత్వం పట్ల మున్సిపల్ కార్మికుల్లో అసంతృప్తి పెరిగి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమించే పరిస్థితికి కారణం కాకూడదని అన్నారు. కార్మికులు గంట గంటకు ఫోటోలు పెట్టాలని, లోకేషన్ పెట్టాలని వేధింపులకు గురిచేస్తున్నారని తెలిపారు. మృతి చెందిన ఔట్ సోర్సింగ్ కార్మికుల కుటుంబలను వారం రోజుల్లో దరఖాస్తు చేసుకుంటే ఐదు నెలలైన డిప్యూటీ కమిషనర్ ఉద్దేశపూర్వకంగానే నియమించడంలేదన్నారు. రెండు నెలల ముందు వరకు ప్రతి నెల వేతనాలను కార్పొరేషన్ ఇచ్చేదని డిప్యూటీ కమిషనర్ నిర్లక్ష్యం వల్లనే 15 నుండి 20 తేదీ వరకు వేతనాలు ఇవ్వడంలేదని తెలిపారు. డిప్యూటీ కమిషనర్ పై తగిన చర్యలు తీసుకోకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని ప్రకటించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బహుజన లెఫ్ట్ మహిళా సంఘం రాష్ట్ర కన్వీనర్ సబ్బని లత, బహుజన మున్సిపల్ వర్కర్స్ యూనియన్ బిఎల్ టీయూ నిజామాబాద్ కామారెడ్డి ఉమ్మడి జిల్లా ప్రధానశ కార్యదర్శి మేకల రాజేందర్, యూనియన్ నాయకులు గంగా శంకర్, రాహుల్, మురళి, డ్రైవర్స్ యూనియన్ నాయకులు నవీన్, ఎల్లయ్య, అబ్దుల్లా పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బిఎల్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్

సిలబస్ పూర్తి చేసి రివిజన్ చెయ్యాలి

ప్రిన్సిపల్‌ల సమావేశంలో జిల్లా ఇంటర్ విద్యాధికారి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

సిలబస్ పూర్తి చేసి వెంటనే రివిజన్ ప్రారంభించాలని జిల్లా ఇంటర్ విద్య అధికారి తిరుమలపూడి రవికుమార్ ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లను ఆదేశించారు. మంగళవారం జిల్లా ఇంటర్ విద్య కార్యాలయంలో జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్‌ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక దృష్టి సారించే విధంగా అధ్యాపకులను సంసిద్ధం చేయడంతో పాటు వందశాతం ఉత్తీర్ణత కోసం కృషి చేయాలని ఆదేశించారు. సిలబస్ రివిజన్ చేయడంతో పాటు ప్రతి సైన్స్ విద్యార్థి కి ప్రయోగశాలలో తగిన శిక్షణ ఇవ్వాలని అన్నారు. శిక్షణకు అవసరమయ్యే ముడి పదార్థాలను కొనుగోలు చేసేందుకు గాను ఇంటర్ బోర్డు డబ్బులు సమకూర్చుతోందని అన్నారు. 90 రోజుల ప్రణాళికను కచ్చితంగా అధ్యాపకులు అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కళాశాల లాగిన్లలో విద్యార్థుల సమాచారం మార్పులు చేర్పులు చేయడానికి మరో అవకాశం ఉందని, నామినల్ రోల్ లలో విద్యార్థుల సబ్జెక్టు చేంజ్, మీడియం చేంజ్, ఫోటో, సంతకం మార్పులు, చేర్పులు చేయడానికి మరో అవకాశం కల్పించడం జరిగిందని అన్నారు. అవసరమైన విద్యార్థుల సమాచారాన్ని వెంటనే సరిదిద్దాలని అన్నారు. ఈ సమాచారాన్ని వెంటనే విద్యార్థులకు చేరవేసి సరైన సమాచారాన్ని క్రోడీకరించి కంప్యూటర్లలో నిక్షిప్తం చేయడానికి తగిన చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాళ్లను ఆదేశించారు. కళాశాల కార్యాలయ సిబ్బంది అన్ని రిజిస్టర్‌లను పూర్తి చేసేలా ప్రతి విషయంపై ప్రిన్సిపాల్ లు ప్రత్యేక శ్రద్ధ వహించి స్వయంగా పర్యవేక్షించాలని జిల్లా ఇంటర్ విద్యా అధికారి ప్రిన్సిపాల్‌లను ఆదేశించారు. అలాగే యాంటీ డ్రగ్స్ విషయంపై అవగాహన సదస్సులు నిర్వహించాలని, విద్యార్థుల్లో మానసిక స్థైర్యాన్ని పెంపొందించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. అవసరమైన వారికి మానసికంగా సంసిద్ధులం చేసేందుకు టేలిమానాస్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ప్రతి కళాశాలలో తాను ఆకస్మిక తనిఖీలు చేసి నివేదికలను రూపొందిస్తున్నామని అన్నారు. జిల్లా ఇంటర్ బోర్డు కమిషనర్ ఆదేశాల మేరకు ప్రతి కళాశాలలో ప్రణాళికబద్ధంగా పనిచేయడంతో పాటు అత్యధిక శాతం ఉత్తీర్ణతను సాధించేందుకు అధ్యాపకులను సంసిద్ధం చేయాలని ఇందుకు ప్రిన్సిపాల్ లు అధ్యాపకులు, సిబ్బంది పై తమ వ్యక్తిగత పర్యవేక్షణను పెంచాలని సూచించారు.


మాట్లాడుతున్న జిల్లా ఇంటర్ విద్యాధికారి తిరుమలపూడి రవికుమార్

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

జిల్లా ఇంటర్ విద్య అధికారి

రాష్ట్ర ఇంటర్ బోర్డు కమిషనర్ ఆదేశాల మేరకు నిబంధనలను అతిక్రమించిన ఏ కళాశాలపై అయిన కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఇంటర్ విద్యా అధికారి తిరుమకపూడి రవికుమార్ అన్నారు. మంగళవారం జిల్లా ఇంటర్ విద్య అధికారి నిజామాబాద్ పట్టణంలోని వినాయక్ నగర్ లో ఉన్న ఎస్.ఆర్. ప్రైవేట్ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణ తో పాటు, తరగతి గదులను, ప్రయోగశాలలను, కనీసం అవసరాల కల్పనపై పర్యవేక్షణ చేశారు. కళాశాల లో నియమ నిబంధనల ప్రకారం ఫైళ్ళ నిర్వహణ, పాలనాపరమైన అనుమతులు, పరీక్ష ఫీజుల వసూలు, ఇతర అన్ని రిజిస్టర్ లను తనిఖీ చేశారు ఈ సందర్భంగా ప్రిన్సిపల్, సిబ్బంది, అధ్యాపకులతో సమావేశం అయ్యారు. బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ సూచించిన మేరకు ప్రణాళిక బద్ధంగా నిర్వహణ జరగాలని ఆదేశించారు. ఏ విధమైన నిర్వహణ లోపాలున్న శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు.

రెండు లారీలు బోల్తా


బోల్తా పడ్డ లారీ

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని ముస్తాపూర్, మేంగారం అటవీ ప్రాంతంలో అదుపుతప్పి రెండు లారీలు బోల్తా పడ్డాయి. వివరాలిలా ఉన్నాయి.. సోమవారం రాత్రి లింగంపేట్ నుంచి కామారెడ్డి వైపు వెళుతున్న మొక్కల లారీ ముస్తాపూర్ గ్రామంలోని మూలమలుపు వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదాన్ని గమనించిన డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో ప్రమాదం తప్పింది. మొక్కల సంచులన్నీ కింద పడిపోయాయి. అలాగే లింగంపేట్ నుంచి ఎల్లారెడ్డి వైపు బియ్యం లోడ్‌తో వెళ్తున్న లారీ మిద్ద మెట్టు వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో సైతం ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు.

ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ ఎన్నిక


ఎన్నికైన నూతన కమిటీ

నవతెలంగాణ-రెంజల్

ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు మంగళవారం మండలంలోని బోర్గం గ్రామంలో ఎమ్మార్పీఎస్ నూతన కమిటీని ఎన్నుకున్నట్టు ఎమ్మార్పీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి బండారి పోశెట్టి పేర్కొన్నారు. బోర్గం గ్రామ అధ్యక్షుడిగా పోతాడి ప్రభాస్, ఉపాధ్యక్షులుగా బత్తిడి రాజు, కార్యదర్శిగా బత్తిడి సతీష్, సలహాదారుడిగా బత్తిడి నితీష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల ఇంచార్జిలు కిన్నెర మోహన్, కళ్యాణి, బండారి వినోద్, మాచాపురం గణేష్ తదితరులు పాల్గొన్నారు.


కామారెడ్డి: క్రీడలను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ



తాడ్వాయి: క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంపీడీవో


నాగిరెడ్డిపేట్‌లో...

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి

- మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ
- పలు చోట్ల సీఎం కప్ క్రీడలు ప్రారంభం

నవతెలంగాణ-విలేకరుల బృందం

కామారెడ్డి : కామారెడ్డి అర్బన్ మండల స్థాయి సీఎం కప్ పోటీలను దేవునిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ చంద్రశేఖర్ రెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పల్లెల నుంచి ప్రపంచ స్థాయి విజేతల కొరకు సీఎం కప్ పోటీలను ఏర్పాటు చేశారన్నారు. క్రీడాకారులకు గెలుపోటములను సమానంగా స్వీకరించాలని విద్యార్థులకు సూచించారు. స్నేహభావంతో క్రీడలను విజయవంతం చేయాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్ గంగాకిషన్, ఎస్‌జిఎఫ్ సెక్రటరీ హీరాలాల్, వ్యాయామ ఉపాధ్యాయులు ప్రభులింగం, లక్ష్మణ్, ఉపాధ్యాయులు జంగం శ్రీశైలం, నవీన్ కుమార్, అశోక్, సునీల్, రమేష్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

గెలుపోటములు సహజమే..

తాడ్వాయి : గెలుపోటములు సహజమేనని ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ అన్నారు. జిల్లా పరిషత్ పాఠశాలలో సీఎం కప్ క్రీడలను ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. విద్యార్థిని విద్యార్థుల క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకే ప్రభుత్వం ఈ కార్యక్రమం ప్రవేశపెట్టిందని అన్నారు. ఓటమి చెందిన జట్టు నిరుత్సాహపడకుండా క్రీడా నైపుణ్యాన్ని కనబరచాలని అన్నారు. దేనికలాన్, నందివాడ, ఎర్రపాడ్, బ్రాహ్మణపల్లి పాఠశాలల క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అహీముద్దీన్, ఎంఈఓ రామస్వామి, ఎంపీవో సవితారెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ సంగారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు బాలు, ఆయా పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

లింగంపేట్ : మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో సీఎం కప్ క్రీడ పోటీసుల ప్రారంభించారు. మండలంలోని ఆయా పాఠశాలకు చెందిన విద్యార్థిని విద్యార్థులు ఆసక్తితో మొదటి రోజు పాల్గొన్నారు. క్రీడలను తహసీల్దార్ నరేందర్, ఎంపీడీవో నరేష్, ఎంఈఓ షౌకత్ అలీ క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. గ్రామీణ క్రీడాకారులను వెలుగు తీసేందుకు సీఎం కప్ క్రీడలను ప్రభుత్వం నిర్వహిస్తుందన్నారు. క్రీడాకారులు తమ నైపుణ్యతను చాటుకోవడానికి ఈ పోటీలు చక్కటి అవకాశమన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాల చెందిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

గాంధారి : మండలంలోని పెట్‌సంగెం గ్రామంలో ముఖ్యమంత్రి కప్ పోటీలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మార్కెట్ కమిటీ చైర్మన్ పరమేశ్వర మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తుందని అన్నారు. యువకులు భవిష్యత్తును చూసుకొని ముందుకు సాగాలని ఎస్సై ఆంజనేయులు అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేశ్వర్, మండల విద్యాధికారి శ్రీహరి, ప్రధానోపాధ్యాయులు కుమారస్వామి, రంగా వేంకటేశ్వరగౌడ్, లక్ష్మణ్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

జుక్కల్ : మండల కేంద్రంలోని జెడ్‌పిహెచ్‌ఎస్ ప్రభుత్వ పాఠశాలలో ముఖ్యమంత్రి క్రీడా పోటీలను జుక్కల్ ఎంపీడీవో శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ క్రీడలను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని, పేద విద్యార్థులు పాఠశాలలో క్రీడా ఉపాధ్యాయులతో నిత్యం క్రీడలను నేర్చుకోవడం వలన మండల స్థాయి నుంచి డివిజన్, జిల్లా, రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొని మంచి భవిష్యత్తును పొందవచ్చునని తెలిపారు. దేశానికి మంచి పేరు తెచ్చే విధంగా ఆటల్లో పాల్గొని పతకాలను సాధించి దేశం గర్వపడేలా చేయాలని సూచించారు. కబడ్డీ, వాలీబాల్, కోకో వంటి ఆటల పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జుక్కల్ ఎంఈఓ తిరుపతి, జెడ్‌పిహెచ్‌ఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నాగిరెడ్డిపేట్ : మండల కేంద్రంలో గల ఆదర్శ పాఠశాలలో సీఎం కప్ క్రీడలను ప్రారంభించినట్లు ఎంపీడీవో ప్రభాకర్ చారి తెలిపారు. ఈ క్రీడలు నేటి నుంచి మూడు రోజులపాటు కొనసాగుతాయని ఆయన వివరించారు. ఆసక్తిగల క్రీడాకారులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఈ క్రీడలలో కోకో, వాలీబాల్, అథ్లెటిక్స్, కబడ్డీ క్రీడలు నిర్వహిస్తున్నట్లు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ ఏడిఏ రత్నం, వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సదాశివనగర్ : మండల స్థాయి చీఫ్ మినిస్టర్ కప్ క్రీడా పోటీలను మండల ప్రత్యేక అధికారి చందర్ నాయక్, ఏఎంసీ చైర్మన్ సంగ్యానాయక్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

మద్నూర్ : విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు ఎంతో ముఖ్యమని ప్రత్యేక అధికారి నాగరాజ్ తెలిపారు. మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో సీఎం కప్ మండల స్థాయి క్రీడా పోటీలను ఎంపీడీవో రాణి, మండల ప్రత్యేక అధికారి నాగరాజ్, ఎంఈఓ రాములు, ఎంపీఓ వెంకట నరసయ్య ప్రారంభించారు. అంతకు ముందు పాఠశాల ఆవరణంలో గల సరస్వతికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మండల ప్రత్యేక అధికారి నాగరాజ్ మాట్లాడుతూ.. మొదట వాలీబాల్, కబడ్డీ పోటీలను ప్రారంభించారు. ఈ పోటీలు ఈనెల 10 నుంచి 12న ముగుస్తాయన్నారు. మూడు రోజులు పాటు నిర్వహించే మండల స్థాయి క్రీడా పోటీలకు ప్రత్యేకంగా ఒక టీంను తయారు చేశామని తెలిపారు. క్లస్టర్ హెడ్మాస్టర్ రాజేందర్, ఏఎస్ఐ సుధాకర్ వివిధ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిజాంసాగర్ : మండల కేంద్రంలోని జవహర్‌లాల్ నవోదయ విద్యాలయంలో మండల స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలను సీఎం కప్ మండల కమిటీ చైర్మన్, మండల ప్రత్యేక అధికారి శ్రీపతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత యువతి, యువకులలో క్రీడల్లో నైపుణ్యం కలిగిన వారిని గుర్తించి వారికి మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రోత్సహించి క్రీడలలో ప్రతిభను కనబరిచే విధంగా రెండు రోజులు క్రీడా పోటీలు నిర్వహించనున్నట్టు తెలిపారు. మండల స్థాయిలో గెలుపొందిన యువతీ యువకులకు జిల్లాస్థాయి క్రీడా పోటీలకు పంపేందుకు కమిటీ ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో సీఎం కప్ కమిటీ సభ్యులు ఉమ్మడి మండల విద్యాధికారులు తిరుపతిరెడ్డి, అమర్ సింగ్, మండల రెవెన్యూ అధికారి బిక్షపతి, ఎస్సై శివకుమార్, మండల అభివృద్ధి అధికారి గంగాధర్, మండల పంచాయతీ అధికారి అనిత, ఫిజికల్ డైరెక్టర్ రాజు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని శవం లభ్యం


మృతి చెందిన గుర్తుతెలియన వ్యక్తి

నవతెలంగాణ-నిజాంసాగర్

మండల కేంద్రంలోని నిజాంసాగర్ డ్యాం 12వ గేటు వద్ద గుర్తు తెలియని మగ వ్యక్తి నీటిలో పడి మృతిచెందినట్టు నిజాంసాగర్ ఎస్సై శివకుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడు బ్లూ కలర్ టీ షర్ట్ ధరించి ఉన్నాడని, వయసు సుమారు 50 నుంచి 55 సంవత్సరాల మధ్యలో ఉంటుందని, కుడి చేతిపై టాటో ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. మృతుడిని ఎవరైనా గుర్తుపడితే నిజాంసాగర్ పోలీస్‌స్టేషన్ 8712686172, 8712686170 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

రాంప్రసాద్ హినాని జయంతి

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ గ్రామ అభివృద్ధికి విశేషంగా కృషి చేసిన సెట్ రాంప్రసాద్ హినాని జయంతి సందర్భంగా మద్నూర్ గ్రామ పెద్దలు, రాజకీయ నాయకులు, వ్యాపారులు, ఉద్యోగులు మండల కేంద్రంలోని పాత బస్టాండ్ సమీపంలో గల ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి సందీప్ కుమార్, ఎంపీడీవో రాణి, పశువైద్య డాక్టర్ బండివార్ విజయ్, మాజీ ఎంపీపీ ప్రజ్ఞా కుమార్, హనుమాన్లు, స్వామి, మాజీ సర్పంచ్ సురేష్, కృష్ణ పటేల్, తెప్ప తుకారం, వ్యాపార వేత్తలు కంకాని గోవింద్‌సేట్, మోదని సురేష్‌సేట్, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో, ఎంపీవో

నవతెలంగాణ-మద్నూర్

మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన వంటకాలను మండల ప్రత్యేకాధికారి నాగరాజ్, ఎంపీడీవో రాణి, ఎంపీవో వెంకట నరసయ్య మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి నాగరాజ్ మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని సూచించారు.

తెలంగాణ జాగృతిలో చేరిన జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్


మాజీ చైర్మన్‌ను ఆహ్వానిస్తున్న జాగృతి అధ్యక్షురాలు కవిత

నవతెలంగాణ-లింగంపేట్

కామారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎదురుగట్ల సంపత్ గౌడ్ మంగళవారం తెలంగాణ జాగృతిలో చేరారు. లింగంపేట్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మాజీ చైర్మన్, జిల్లా డిసిసిబి మాజీ డైరెక్టర్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎదురు గట్ల సంపత్ గౌడ్ హైదరాబాద్‌లో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత నివాస గృహంలో కండువా కప్పి సంస్థలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో తెలంగాణ జాగృతి నాయకులు, గ్రంథాలయ సంస్థ రాష్ట్ర మాజీ అధ్యక్షులు అయాచితం శ్రీధర్, తెలంగాణ ఫుడ్స్ రాష్ట్ర మాజీ చైర్మన్ రాజీవ్ సాగర్, నవీన్ ఆచారి, నరేందర్ యాదవ్, ఈగ సంతోష్, లలిత యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత


పట్టుకున్న ఇసుక ట్రాక్టర్

నవతెలంగాణ-పోతంగల్


మండలంలోని కొడిచర్ల గ్రామ శివారులో మంగళవారం అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఓ ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకున్నట్టు ఎస్ఐ సందీప్ తెలిపారు. ట్రాక్టర్‌ను మైనింగ్ శాఖ అధికారులకు అప్పగించినట్టు పేర్కొన్నారు.

ఆది శీనన్న విజయం.. ప్రజాస్వామ్య విజయం

నవతెలంగాణ-రామారెడ్డి

ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కోర్టులో వేసిన పిటిషన్‌పై కోర్టు మాజీ ఎమ్మెల్యే రమేష్ అనర్హుడని, రూ.30 లక్షలు జరిమానా విధించడం ప్రజాస్వామ్య విజయమని జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మాజీ ఎమ్మెల్యే రమేష్‌కు టికెట్ ఇచ్చిన కేసీఆర్ కూడా దోషేనని, విదేశీయులకు ప్రజాప్రతినిధుల టిక్కెట్లను ఇచ్చి భారతదేశ పౌరులను అవమానించాడని, ఉద్యమకారులకు టికెట్ ఇవ్వకుండా విదేశీయులకు టిక్కెట్ అమ్ముకున్న ఘన చరిత్ర కేసీఆర్‌దని పేర్కొన్నారు. కెసిఆర్‌పై కూడా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ


చెక్కును అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-గాంధారి

మండలం లోని మేడిపల్లి, గండిపేట్, గండివేట్ తండా, సర్వాపూర్, గౌరారం, మొండి సడక్, ముందేలి, వెంకటాపూర్ తండా గ్రామాల్లో కల్యాణలక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బండారి పరమేశ్వర్, అధ్యక్షులు మోహన్ నాయక్ మంగళవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ వంజరి శంకర్, నాయకులు శ్రీనివాస్, మనోహర్ రావు, కృష్ణగౌడ్, కేతావత్ దేవిసింగ్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

- సీఐటీయూ జిల్లా అధ్యక్షులు శంకర్‌గౌడ్

నవతెలంగాణ-బోధన్


మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షులు శంకర్‌గౌడ్

గత 40 సంవత్సరాలుగా ప్రజలకు సేవలందిస్తున్న అంగన్వాడీ టీచర్లను ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు శంకర్‌గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ప్రాజెక్టు అధికారికి, సీడీపీఓకు వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బిజెపి ప్రభుత్వం గత పది సంవత్సరాలుగా అధికారంలో ఉన్నా.. అంగన్వాడీలకు కనీస వేతనాలు పెంచలేదని, ఉద్యోగ భద్రత కల్పించలేదని, కనీసం రిటైర్మెంట్ బెనిఫిట్స్ కూడా కల్పించలేదని తెలిపారు. అంగన్వాడీలు, ఆశాలు మొదలగు రంగాల కార్మికుల పట్ల నరేంద్ర మోడీ సర్కార్ పట్టించుకోవడం లేదని అన్నారు. దేశంలోని ప్రజలు, కార్మికుల తలసరి ఆదాయాలు పెరగకుండా దేశం ఎలా అభివృద్ధి చెందుతుందని ప్రశ్నించారు. నరేంద్ర మోడీ సర్కార్ కేవలం ఈ దేశాన్ని దోచి కార్పొరేట్ శక్తులకు పెడుతుందని విమర్శించారు. గత పది సంవత్సరాలుగా అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వంలోని నాయకుల ఆస్తులు పెరిగాయని అన్నారు. కార్మికులకు ఒరిగిందేమీ లేదని విమర్శించారు. ఇంటికో ఉద్యోగం రాలేదని, మూడెకరాల భూమి రాలేదని, డబుల్ బెడ్ రూమ్ రాలేవని గుర్తు చేశారు. కష్టపడి పనిచేసే అంగన్వాడీ, ఆశ, గ్రామపంచాయతీ, మున్సిపల్, పంచాయతీ, ఐకెపి మొదలగు రంగాల కార్మికుల జీవితాలు మారలేవని అన్నారు. ప్రభుత్వ పరిధిలో పనిచేస్తున్నప్పటికీ వెట్టిచాకిరికి గురవుతున్నారని అన్నారు. ఈ రాష్ట్రాన్ని ప్రజాపాలన పేరుతో పరిపాలిస్తున్న రేవంత్‌రెడ్డి సర్కార్ ప్రజలకు కార్మికులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేదని విమర్శించారు. వెంటనే అంగన్వాడీలను పర్మినెంట్ ఉద్యోగులుగా గుర్తించాలని, డిసెంబర్ 12వ తేదీన చలో హైదరాబాద్ నిర్వహిస్తున్నామని ఈ కార్యక్రమానికి అంగన్వాడీలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రేణుక, విజయలక్ష్మి, అనసూయ, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలి

- టిపిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సిహెచ్ అనిల్ కుమార్

నవతెలంగాణ-కామారెడ్డి



మాట్లాడుతున్న టిపిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సిహెచ్ అనిల్ కుమార్

మంత్రివర్గ ఉప సంఘం హామీనిచ్చిన విధంగా ఉద్యోగ ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లును వెంటనే మంజూరు చేయాలని టిపిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సిహెచ్ అనిల్ కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని వశిష్ట డిగ్రీ కాలేజీలో టిపిటిఎఫ్ కామారెడ్డి జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర అధ్యక్షులు హాజరై మాట్లాడుతూ 2024 మార్చి నుండి ఉద్యోగ విరమణ చెందిన ఉపాధ్యాయుల పెన్షన్ బెనిఫిట్స్ ఇవ్వకపోవడం శోచనీయమని తెలిపారు. ఉద్యోగులకు సంబంధించిన గ్రాటివిటీ, జిపిఎఫ్ అమౌంట్ విడుదలకు నెలల సమయం పట్టడం విచారకరమని తెలిపారు. కార్యవర్గ సమావేశంలో నూతనంగా టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా చింతల లింగం, జిల్లా ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యవర్గ సమావేశంలో సిహెచ్ లక్ష్మి, విజయ శ్రీ, తృప్తి శ్రీనివాస్, హరి సింగ్ నరేందర్, గోపి శ్రీనివాస్, సిహెచ్ ప్రకాష్, కృష్ణ, కృష్ణమూర్తి, హరీష్, కేఎస్ భగత్, రామాగౌడ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పాత తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

సచివాలయం ముందు నూతనంగా ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహానికి నిరసనగా మంగళవారం మండల కేంద్రంలో పాత తెలంగాణ తల్లి విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో ఉన్న తెలంగాణ తల్లి విగ్రహ రూపురేఖలు మార్చి నూతనంగా కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఉన్న తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేయడం పట్ల నిరసనగా పాలాభిషేకం చేసినట్లు వారు పేర్కొన్నారు. పాత తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రతాపరెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గుర్రాల సిద్దయ్య, మాజీ జెడ్పిటిసి మనోహర్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ నరసింహులు, నాయకులు లక్ష్మీకాంతం, వంశీ గౌడ్, హనుమంతరెడ్డి, ఫరీద్, సుధాకర్, దుర్గారెడ్డి, మల్లేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని నీలా గ్రామంలో మండల ఉపాధ్యక్షులు గోసుల గంగా కిషన్ ఆధ్వర్యంలో బాధితులకు సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదల ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం సీఎం సహాయనిధి నుంచి ఆర్థిక సహాయాన్ని అందజేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందని ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట గ్రామ అధ్యక్షులు సొక్కుల సాయిలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

వెదజల్లే పద్ధతితో ఖర్చు తక్కువ

- మండల వ్యవసాయాధికారిణి భాను శ్రీ

నవతెలంగాణ-రామారెడ్డి


మాట్లాడుతున్న మండల వ్యవసాయాధికారిణి భానుశ్రీ

వరి పంట సాగులో వెదజల్లే పద్ధతిలో ఖర్చు తక్కువతో లాభం ఎక్కువగా ఉందని మండల వ్యవసాయాధికారిణి భానుశ్రీ తెలిపారు. మంగళవారం మండలంలో వరిసాగును వెదజల్లే పద్ధతిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు వెదజల్లే పద్ధతిపై మొగ్గు చూపుతున్నారని అన్నారు. రామారెడ్డిలో రైతు వెదజల్లే పద్ధతిలో వరి సాగును వ్యవసాయ అధికారులు పరిశీలించారు. రైతులకు సాగుపై మెలకువలను సూచించారు. వెదజల్లే పద్ధతిలో రూ.5 నుంచి 6 వేలు ఖర్చు తగ్గుతుందని, కూలీల కొరతను అధిగమించవచ్చని సూచించారు. కార్యక్రమంలో స్థానిక ఏఈఓ రాకేష్, నిఖిత రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్‌లో శ్మశానవాటికకు దారి పరిశీలన

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండలంలోని ఆత్మకూర్ గ్రామంలో శ్మశాన వాటికకు వెళ్లే దారిని పరిశీలించినట్లు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మెహమూద్ తెలిపారు. గ్రామంలో బీసీలు శ్మశాన వాటికకు వెళ్లడానికి దారి లేకపోవడంతో దారిని ఏర్పాటు చేయడానికి సర్వేయర్‌తో సర్వే చేయించినట్టు ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట మాజీ జెడ్పిటిసి మనోహర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బాల్‌రెడ్డి తదితరులున్నారు.

విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి : షీ టీం

నవతెలంగాణ-గాంధారి

విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని షీ టీం బృందం సూచించింది. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఎల్లారెడ్డి డివిజన్ షి టీం, మహిళా సాధికారత కేంద్రం కామారెడ్డి ఆధ్వర్యంలో ఫోక్సో చట్టం, లింగ సమానతలు, ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. టీసీమ్ ఇంచార్జ్ సుప్రజ మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో ఉండాలని తెలిపారు. ఫోక్సో చట్టంలోని కఠినమైన శిక్షల గురించి తెలియజేశారు. తులసి మాట్లాడుతూ.. లింగ సమానత్వాన్ని పెంపొందించాలని ఆడపిల్లలు ఉన్నత చదువులు చదవాలని సూచించారు. సౌందర్య మాట్లాడుతూ.. చిన్న వయసు నుండే ఆర్థిక అక్షరాస్యత కలిగి ఉండాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సుప్రజ, శిరీష, శారద, తులసి, సౌందర్య కళాశాల ప్రిన్సిపాల్ గంగారాం విద్యార్థులు కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

సన్నబియ్యం పంపిణీ చేయాలి

• ఖండ్‌గాం గ్రామస్తుల నిరసన

నవతెలంగాణ-బోధన్



నిరసన వ్యక్తంచేస్తున్న గ్రామస్తులు

మండలంలోని ఖండ్‌గాం గ్రామంలో రేషన్ షాపు ద్వారా సన్న బియ్యం పంపిణీ చేయాలంటూ గ్రామస్థులు రేషన్ షాప్ ఎదుట మంగళవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలో కొంతమందికి సన్నబియ్యం, మరికొందరికి దొడ్డు బియ్యం పంపిణీ చేస్తుండడంతో ఇలా ఎందుకు చేస్తున్నారని డీలర్‌ను నిలదీశారు. గోదాం నుంచే కొన్ని బస్తాలు సన్న బియ్యం, దొడ్డు బియ్యం వచ్చాయని డీలర్ చెప్పడంతో గ్రామస్థులు తహసీల్దార్ విఠల్‌కు ఫోన్‌లో సమస్య వివరించారు. అలాగే సన్న బియ్యం పంపిణీ చేసే వరకు దుకాణం తెరవవద్దని, సన్న బియ్యం వస్తేనే పంపిణీ చేయాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు.

మహాధర్నాకు తరలిన వికలాంగులు

నవతెలంగాణ-బోధన్



మహాధర్నాకు వెళ్తున్న వికలాంగులు

వికలాంగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద చేపట్టనున్న మహాధర్నాకు బోధన్, ఎడపల్లి మండలాల నుంచి ఎన్.పీ.ఆర్.డీ. ఆధ్వర్యంలో వికలాంగులు మంగళవారం తరలివెళ్లారు. హైదరాబాద్ వెళ్లిన వారిలో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు గైని రాములు, ప్రధాన కార్యదర్శి గంగాధర్, ఉపాధ్యక్షులు షేక్ నజీర్, జిల్లా సహాయ కార్యదర్శి నాగమణి, జిల్లా కోశాధికారి రామ్ పటేల్, జిల్లా ఉపాధ్యక్షురాలు సాయమ్మ, కొప్పుల లలిత, అర్చన, సంగీత, రాకేష్ వర్మ గోవుర్ సాయిలు, రాజు, హరీష్, ధర్మయ్య శ్రీనివాస్, ఎల్లయ్య రాజు, హనుమంతరావు, తదితరులు ఉన్నారు.

విద్యార్థుల జీవితంలో క్రీడలు భాగం కావాలి

• సబ్ కలెక్టర్ వికాస్ మహతో

నవతెలంగాణ-బోధన్

విద్యార్థుల జీవితంలో క్రీడలు భాగం కావాలని సబ్ కలెక్టర్ వికాస్ మహతో అన్నారు. మంగళవారం పట్టణంలోని విజయమేరీ హైస్కూల్‌లో జరిగిన సీఎం కప్ క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు విద్యార్థి దశ నుండే క్రీడలపై మక్కువ పెంచుకోవాలని, క్రీడలు మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయని అన్నారు. ముందుగా క్రీడల పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులచే గౌరవ వందనాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తూము పద్మా శరత్‌రెడ్డి, ఏసీపీ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ, పట్టణ ఎస్‌హెచ్‌వో వి.వెంకట నారాయణ, ఎంఈవో నాగయ్య, ఎంపీడీవో బాలగంగాధర్, కౌన్సిలర్‌లు తూము శరత్‌రెడ్డి, అబ్దుల్లా, అలీం రజా, పీఈటీలు, విద్యార్థులు, పాల్గొన్నారు.

తెలంగాణ తల్లిని మార్చి కాంగ్రెస్ తల్లిని ఏర్పాటు చేయటం సరికాదు

నవతెలంగాణ-రామారెడ్డి

తెలంగాణ ఉద్యమ కాలంలో మేధావులు, నాయకులు, కలిసి తెలంగాణ తల్లిని ఏర్పాటు చేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే కాంగ్రెస్ తల్లి ని ఏర్పాటు చేయడం సరైన పద్ధతి కాదని మాజీ ఎంపీపీ నారెడ్డి దశరథ్ రెడ్డి, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు రంగు రవీందర్‌గౌడ్ అన్నారు. మంగళ వారం వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష సాధింపు ధోరణిని వదిలి ప్రజా సంక్షేమం కోసం పనిచేయాలని సూచించారు. తలపై కిరీటం, చేతిలో బతుకమ్మను తొలగించడం ముమ్మాటికి తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయటమే అన్నారు. కార్యక్రమంలో రైతుబంధు మండల మాజీ అధ్యక్షులు గురిజాల నారాయణరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ పడిగేల శ్రీనివాస్, కాలభైరవ స్వామి దేవాలయ మాజీ చైర్మన్ గంజి సతీష్ గుప్తా, వివిధ గ్రామాల మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

తాడ్వాయి : తెలంగాణ తల్లి విగ్రహ రూపాన్ని మార్చడం సమంజసం కాదని తెలంగాణ తల్లి చిత్రపటానికి మండల కేంద్రంలో పాలాభిషేకం చేసినట్లు సొసైటీ చైర్మన్ నల్లవెల్లి కపిరెడ్డి మంగళవారం తెలిపారు. విగ్రహంలో బతుకమ్మ లేకుండా ఆవిష్కరించడం తెలంగాణ మహిళలను కించపరిచినట్లుగా ఉందని సోనియాగాంధీ మెప్పుకోసం విగ్రహాన్ని మార్చడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో మండల మాజీ ఉపాధ్యక్షులు ఎం.నరసింహులు బీఆర్ఎస్ యూత్ నాయకులు రమేష్ రావు, ఎం.రాము, బి.సంజీవరెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పిడిఎస్ బియ్యం పట్టివేత

నవతెలంగాణ-ఎడపల్లి

నిజామాబాద్ నుంచి మహారాష్ట్రకు అక్రమంగా తరలిస్తున్న పిడిఎస్ బియ్యం వ్యాన్‌ను సోమవారం రాత్రి ఎస్సై వంశీ కృష్ణరెడ్డి, సిబ్బంది పట్టుకున్నారు. వాహనంలో 74 బియ్యం బస్తాలు ఉన్నాయని తెలిపారు. వాహనాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

ప్రథమ స్థానం పొందిన విద్యార్థికి అభినందనలు

నవతెలంగాణ-తాడ్వాయి

బయలాజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో మండలంలోని ఎర్రపాడు జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థిని కే.గంగోత్రి ప్రథమ స్థానం దక్కింది. మంగళవారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో విద్యార్థినిని ప్రోత్సహించిన ఉపాధ్యాయురాలు సుప్రియను ప్రధానోపాధ్యాయులు డి.సంగారెడ్డి, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

వేస్ట్ మేనేజ్మెంట్‌లో రాష్ట్ర స్థాయికి ఎంపిక

నవతెలంగాణ-తాడ్వాయి

మండలంలోని కృష్ణజివాడి జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన విద్యార్థులు రామ్ చరణ్, నరేష్‌లు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు రామ స్వామి మంగళవారం తెలిపారు. 6,7 తేదీల్లో బాన్సువాడలో నిర్వహించిన పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. వీరిని ప్రోత్సహించిన ఉపాధ్యాయులు గిర్మబోయి సుజాతలను ఉపాధ్యాయ బృందం అభినందించారు.

చలికాలంలో జలుబు, దగ్గు, దమ్ము వ్యాధులపట్ల జాగ్రత్తగా ఉండాలి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

చలికాలంలో చలి తీవ్రత అధికంగా ఉన్న దృశ్య జలుబు, దగ్గు, దమ్ము లాంటి వ్యాధులు అధికంగా వస్తాయని వాటిపట్ల జాగ్రత్తగా ఉండాలని మండల అరోగ్య విస్తరణ అధికారి వై శంకర్ పేర్కొన్నారు. మంగళవారం ఇందల్ వాయి మండల కేంద్రంలోని తిర్మన్ పల్లి గ్రామంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ బాలికల పాఠశాల, కళాశాల లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఇందల్ వాయి ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వై శంకర్ మాట్లాడుతూ విద్యార్థులకు పౌష్టిక ఆహారాన్ని అందించాలని, స్వెటర్లు ధరించి వెచ్చగా ఉండాలని సూచించారు. జలుబు, దగ్గు తీవ్రమైతే నిమోనియాకు దారితీస్తుందని దాని ద్వారా శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది అవుతుందని , వెంటనే పాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చి డాక్టర్ చే చికిత్స చేయించుకోవాలని విద్యార్థులకు సూచించారు. స్టోర్ రూములు పరిశీలించి బియ్యంలో గాని పప్పులో గాని పురుగులు ఉన్నట్లయితే వెంటనే తిరిగి కాంట్రాక్టర్ ఇచ్చేయాలని అదేశించారు. ఎట్టి పరిస్థితుల్లో వాటిని వంట చేయరాదని సూచించారు. అయోడైజ్డ్ ఉప్పునె వాడాలని తెలిపారు. కుళ్లిన పండ్లు ఉన్నట్లయితే పారవేయాలని ప్రిన్సిపాల్ కు ఆదేశించారు. జలుబు, దగ్గు, జ్వరంతో బాధపడుతున్న విద్యార్థులకు చికిత్స అందజేశారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు అక్బర్ అలీ, ఆరోగ్య కార్యకర్తలు శారద, వెంకట్ రెడ్డి, ప్రిన్సిపాల్ పద్మజ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పిల్లలకు న్యూట్రిషన్ కిట్స్ అందజేత

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్‌లోని రెడ్ క్రాస్‌లో తలసేమియా వ్యాధితో బాధపడుతున్న పిల్లలకు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి రాజశ్రీ చేతుల మీదుగా పిల్లలకు న్యూట్రిషన్ కిట్స్ అందించి అన్నదాన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఇందుకు సహకరించిన న్యూట్రిషన్ కిట్స్ దాత జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్ జోన్ 12 అధికారి జిల్కర్ నయన్, అన్నదాన దాత ఇందూర్ మదర్ హండ్ ఆసుపత్రి గైనకాలజిస్ట్ డా.కరిపే తేజస్వి, ఎం.డి.కరిపే అక్షయ్‌ని అభినందిస్తూ అలాగే రెడ్ క్రాస్ చేపడుతున్న రక్త దాన శిబిరాలు ఎన్నో సేవ కార్యక్రమాలను కొనియాడారు. యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చెయ్యాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా ఛైర్మన్ బుస్స ఆంజనేయులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తోట రాజశేఖర్, కోశాధికారి కరిపే రవీందర్, మోపాల్ మండల చైర్మన్ వెంకటేశ్వరులు, తలసీమియా మెడికల్ ఆఫీసర్ డా.అశ్విన్ కుమార్ రెడ్డి, బ్లడ్ బ్యాంకు మెడికల్ ఆఫీసర్ డా.రాజేష్, పి.ఆర్.ఓ బి.రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సహాయం

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలంలోని బట్టాపూర్ గ్రామానికి చెందిన బురుకల నరేష్ అనే వ్యక్తి అనారోగ్యంతో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి చనిపోయాడు. స్థానిక కాంగ్రెస్ నాయకుల ద్వారా విషయాన్ని తెలుసుకున్న బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్‌రెడ్డి, తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. అంత్యక్రియలకు రూ.5వేలు ఆర్థిక సాయం చేశారు. ఇందులో భాగంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గోల్కొండ మల్లేష్, గోలి కైలాస్, షేక్ కరీం, బుక్యా నందు, చిల్క ప్రసాద్ ఉన్నారు.

ముసాయిదా జాబితాపై అభ్యంతరాలుంటే తెలపండి

• అదనపు కలెక్టర్ అంకిత్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



సమావేశంలో పాల్గొన్న రాజకీయ నాయకులు

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ ఏర్పాటులో భాగంగా రూపొందించిన ముసాయిదా పోలింగ్ స్టేషన్‌ల జాబితాపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే 12 లోపు తెలియజేయాలని అదనపు కలెక్టర్ అంకిత్ రాజకీయ పార్టీలను కోరారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని తన ఛాంబర్లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కలెక్టర్ పర్యవేక్షణలో ముసాయిదా పోలింగ్ కేంద్రాల జాబితాను రూపొందించడం జరిగిందన్నారు. ఇప్పటికే ఈ నెల 7న జిల్లాలోని అన్ని మండలాలు, గ్రామ పంచాయతీలలో ముసాయిదా జాబితాను ప్రకటించామని గుర్తు చేశారు. జిల్లాలో మొత్తం 545 గ్రామ పంచాయతీలు, 5022 వార్డులు ఉండగా, రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను అనుసరిస్తూ 5053 పోలింగ్ కేంద్రాలను గుర్తిస్తూ ముసాయిదా జాబితాను రూపొందించామని వివరించారు. ఆర్మూర్ డివిజన్ పరిధిలో 180 జీపీలు, 1766 వార్డులకు 1786 పోలింగ్ కేంద్రాలు, బోధన్ డివిజన్ పరిధిలో 152 జీపీలు, 1354 వార్డులకు 1354 పోలింగ్ కేంద్రాలు, నిజామాబాద్ డివిజన్ పరిధిలో 213 జీపీలు, 1902 వార్డులకు 1913 పోలింగ్ కేంద్రాలను ముసాయిదా జాబితాలో పొందుపర్చడం జరిగిందన్నారు. ఈ ముసాయిదా జాబితాపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 12 లోపు తెలుపవచ్చని, 12న అన్ని మండలాల్లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎంపీడీఓలు నిర్వహించే సమావేశంలోనూ అభ్యంతరాలు స్వీకరిస్తారని తెలిపారు. వచ్చిన అభ్యంతరాలను 13న పరిష్కరింస్తామని, జిల్లా పాలనాధికారి ఆమోదం అనంతరం 17న అన్ని మండలాలు, గ్రామ పంచాయతీలలో తుది పోలింగ్ కేంద్రాల జాబితా ప్రకటించబడుతుందన్నారు. సమావేశంలో ఇంచార్జ్ డీపీఓ శ్రీనివాస్, ఆర్మూర్ ఆర్డీఓ రాజాగౌడ్, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

విగ్రహ రూపాన్ని మార్చడం ఎంత వరకు సమంజసం

• మాజీ జడ్పీ టిసి బాజిరెడ్డి జగన్ మోహన్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ధర్పల్లి మాజీ జడ్పీ టిసి బాజిరెడ్డి జగన్ మోహన్ ఆధ్వర్యంలో మంగళవారం ఇందల్ వాయి మండలంలోని గన్నారం కమాన్ వద్ద, డిచ్ పల్లి మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా దర్పల్లి మాజీ జడ్పీ టిసి బాజిరెడ్డి జగన్ మోహన్, ఇందల్ వాయి మాజీ ఎంపీపీ బాధవత్ రమేష్ నాయక్, డిచ్ పల్లి మండల బిఆర్ఎస్ మాజీ అధ్యక్షులు శక్కరి కొండ కృష్ణ తోపాటు తదితరులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ తల్లి విగ్రహ రూపాన్ని మార్చడం ఎంతవరకూ సమంజసం కాదని, కొత్తగా ఏర్పాటైన విగ్రహంలో బతుకమ్మ లేకుండానే ఆవిష్కరించడం సబబు కాదన్నారు. ఇది తెలంగాణ మహిళ ఆడపడుచులను, తెలంగాణ సంస్కృతిని అవమానించినట్లేనని వారన్నారు. సోనియా గాంధీ పుట్టిన రోజును పురస్కరించుకుని సోనియాగాంధీ మెప్పుకోసం తహతహలాడుతు తెలంగాణ తల్లిని మార్చి, తెలంగాణ తల్లి అవతర దినోత్సవం జరుపుకోవడం సిగ్గుచేటైన విషయమన్నారు. కార్యక్రమంలో బుసని అంజయ్య, రూరల్ అధ్యక్షులు పాశం కుమార్, ధర్పల్లి యూత్ అధ్యక్షులు మోహమ్మద్ నజీర్, పులి శ్రీనివాస్, మాజీ ఎంపిటిసిలు చింతల దాస్, మారంపల్లి సుధాకర్, బిరిష్ శెట్టి, కుమ్మరి శ్రీనివాస్, అను హుస్సేన్, మాజీ కో ఆప్షన్ షేక్ నయీమ్ తోపాటు మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీ పార్టీ సీనియర్ నాయకులు, పార్టీ ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు పెద్దమ్మ 21వ వార్షికోత్సవం

• విజయవంతం చేయాలని పిలుపు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్ వాయి మండలంలోని యెల్లారెడ్డిపల్లి గ్రామ పరిధిలోని ధర్పల్లి-ఇందల్ వాయి రహదారిపై ఉన్న పెద్దమ్మ ఆలయం 21వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం అభిషేకం, అర్చనలు, కళ్యాణం, బోనాల ఊరేగింపు, అన్న సత్రం నిర్వహించనున్నట్లు అలయ కమిటీ అధ్యక్షుడు బొడ్డు రవి తెలిపారు. మంగళవారం ఆలయం వద్ద సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివరాలు వెల్లడించారు.

ఈ వార్షికోత్సవంలో భాగంగా గ్రామం నుండి ఆలయం వరకు బోనాలను డప్పు వాయిద్యాలతో ఊరేగిస్తామని అన్నారు. ఈ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుండి భారీ సంఖ్యలో ప్రజలు భక్తులు పాల్గొంటారని ఆయన తెలిపారు. గతకొన్ని రోజులుగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది ఎలాంటి లోటు పాట్లు లేకుండా ఏర్పాట్లు పూర్తి చేసినట్టు చెప్పారు. సమావేశంలో ఆర్.సాయిలు, పి.నడ్పి సాయిలు, గంగాధర్, సాగర్, మల్లయ్య, సునీల్, రజనికాంత్, నరేష్, సాయినాథ్, లక్ష్మణ్, సతీష్, రాములు, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

• కమ్మర్‌పల్లి ఎస్ఐ అనిల్‌రెడ్డి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

యువత గంజాయి, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ అనిల్ రెడ్డి అన్నారు. సోమవారం రాత్రి మండలంలోని అమీర్ నగర్ గ్రామంలో నిజామాబాద్ ఇంచార్జి పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు నిజామాబాద్ పోలీస్ కళా బృందం ఆధ్వర్యంలో ప్రజలకు చక్కని నాటిక, పాటలతో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. వాహనదారులు హెల్మెట్ ధరించాలని, హెల్మెట్ బరువు కాదు బాధ్యత అని అన్నారు. రోడ్డు భద్రత నియమాలు పాటించాలని కోరారు. మహిళల భద్రత కోసం రక్షణగా నిజామాబాద్ షీ టీమ్ రక్షణ కల్పిస్తుందని తెలిపారు. నిజామాబాద్ షీ టీం నెంబర్ 8712659795 లేదా డయల్ 100 కి ఫోన్‌చేయాలన్నారు. మొబైల్ ఫోన్ దొంగిలించిన, పోగొట్టుకున్న సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్ రికవరి చేయడం జరుగుతుందని తెలిపారు. అత్యవసరసమయంలో డయల్ 100 ఉపయోగించుకోవాలని సూచించారు. మూఢ నమ్మకాలు నమ్మవద్దని, ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, సీసీ కెమెరాలు వల్ల గ్రామం సురక్షితంగా ఉంటుందని, ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానం అన్నారు. ఆన్లైన్ మోసాలు గురించి అప్రమత్తంగా ఉండాలని వివరించారు. దీనికి సంబంధించి టోల్ ఫ్రీ నెంబర్ 1930కు ఫోన్ చేయాలన్నారు. గల్ఫ్ దేశాలకు వెళ్తున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, నకిలీ ఏజెంట్లు నిరుద్యోగులకు మాయమాటలు, లేనిపోని ఆశలు, అత్యాశలు చూపించి మోసం చేస్తున్నందున ప్రజలు జాగ్రత్తగా ఉండాలని కోరారు. నేరాలు, చట్టాలపై అవగాహన కల్పించారు.

చదువుతోపాటు పరిశోధనలపై దృష్టి కేంద్రీకరించాలి

• రిటైర్డ్ లెక్చరర్ భుజంగం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

యూనివర్సిటీలో చదువుతోపాటు పరిశోధనలపై దృష్టి కేంద్రీకరించాలని,

విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని యూనివర్సిటీ వనరులను వినియోగించుకొని అత్యుత్తమంగా ఎదగాలని, విద్యార్థి జీవితంలో సమయం చాలా ముఖ్యమైనదని, సమయాన్ని సద్వినియోగం చేసుకున్న వాళ్లే విజేతలుగా నిలబడ్డారని రిటైర్డ్ లెక్చరర్ ఏ.భుజంగం పేర్కొన్నారు. మంగళవారం తెలంగాణ యూనివర్సిటీ లో నూతనంగా ప్రవేశం పొందిన విద్యార్థులకు ప్రిన్సిపల్ ప్రొఫెసర్ డాక్టర్ సిహెచ్ ఆరతి అధ్యక్షతన పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రిటైర్డ్ లెక్చరర్ ఏ.భుజంగం పాల్గొని మాట్లాడుతూ తెలివితేటలను ఉపయోగించుకున్న వాళ్లే జీవితంలో స్థిరపడతారని పేర్కొన్నారు. అకాడమిక్ విద్యతోపాటు, లోతైన పరిశోధనలపై మనసును కేంద్రీకరించి నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థులు ఒత్తిడికి దూరంగా ఉండి మానసికంగా, శారీరకంగా ఉల్లాసంగా ఉండాలన్నారు. దీని కొరకు క్రీడలు, సంగీతం, యోగా, మెడిటేషన్ వంటి అంశాలపై దృష్టికేంద్రీకరించాలన్నారు. కార్యక్రమంలో ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ గంటా చంద్రశేఖర్, యూజీసీ డైరెక్టర్ ప్రొఫెసర్ ఆంజనేయులు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ రవీందర్ రెడ్డి, బోధన బోధ నేత్ర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.


ఇసుక వాహనం పట్టివేత

నవతెలంగాణ-మోర్తాడ్

జాతీయ రహదారిపై పోలీసుల వాహనాల తనిఖీల్లో భాగంగా అక్రమంగా ఇసుక తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్నట్లు ఎస్సై విక్రం మంగళవారం తెలిపారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా భారీ వాహనంలో ఇసుకను మోర్తాడ్ నుండి ఆర్మూర్ వైపు తరలిస్తుండగా పట్టుకొని విచారించినట్లు తెలిపారు. సంబంధిత అధికారులు అనుమతి పత్రాలు ఏమీ లేకపోవడంతో ఆ వాహనాన్ని పోలీస్ స్టేషన్ తరలించి మైనింగ్ అధికారులకు అప్పగించనున్నట్లు తెలిపారు.

నియోజకవర్గఅభివృద్ధికి నిధులు ఇవ్వాలి

• శాసనసభ సమావేశాల్లో ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి



నవతెలంగాణ-ఆర్మూర్

నియోజకవర్గ అభివృద్ధికి నిధులు ఇవ్వాలని ప్రజలతో ఎన్నుకోబడ్డ శాసన సభ్యునిగా ప్రజల సమస్యలు తీరుస్తానని ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి అన్నారు. సోమవారం శాసనసభ సమావేశంలో మాట్లాడుతూ.. 2014 జూన్ 2న మిగులు బడ్జెట్లో ఉన్న రాష్ట్రంలో ఉన్న విగ్రహం, ఇప్పుడు అప్పుల పాలైన తెలంగాణ లాగా ఈ విగ్రహం ఉందని ప్రజలు అంటున్నారని, తెలంగాణ ప్రజల బతుకులు మార్చాలి కానీ విగ్రహాలను మారుస్తూ పోతే ప్రజలపై గుదిబండగా మారుతోందని అన్నారు.

మంత్రి పొన్నంను కలిసిన గడుగు గంగాధర్

నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను హైదరాబాదులో రాష్ట్ర రైతు కమిషన్ సభ్యులుగా ఎన్నికైన గడుగు గంగాధర్ మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర రైతు కమిషన్ సభ్యులుగా ఎన్నికైన గంగాధర్‌ను శాలువాతో సన్మానించారు.

జాతీయ స్కూల్ గేమ్స్ సాఫ్ట్ బాల్ పోటీలకు తొర్లికొండ విద్యార్థిని

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి



విద్యార్థులను అభినందిస్తున్న పలువురు

ఈనెల 7 నుంచి 9వరకు జెడ్పిహెచ్ఎస్ బాయ్స్ ఆర్మూర్ క్రీడా మైదానంలో జరిగిన 68వ స్కూల్ గేమ్స్ రాష్ట్ర సాఫ్ట్ బాల్ అండర్-17 పోటీలలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తొర్లికొండ విద్యార్థులు బాలుర విభాగంలో జక్కం పవన్ పాల్గొని రజిత పతాకం అందుకున్నాడు. బాలికల విభాగంలో సాంబార్ నిత్య శ్రీ, గేడం సరితలు రజత పతకాలు అందుకున్నారు. జట్టు విజయానికి కీలక పాత్ర పోషించిన సాంబార్ నిత్యశ్రీ జనవరి 5 నుంచి 9వరకు జల్గావ్ జిల్లా మహారాష్ట్రలో జరిగే జాతీయ స్కూల్ గేమ్స్ సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ మర్కంటి గంగా మోహన్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారి ఎం.శ్రీనివాస్ రాష్ట్ర పోటీల్లో పథకాలు సాధించిన క్రీడాకారులను, జాతీయ పోటీలకు ఎంపికైన నిత్యశ్రీను అభినందించారు.

మానవత్వం చాటుకున్న ట్రాఫిక్ పోలీస్

నవతెలంగాణ-కంఠేశ్వర్

జిల్లా కేంద్రంలోని రోడ్డుపై పడిపోయిన నిత్యవసరల సరుకుల సంచిని ట్రాఫిక్ పోలీసులు మంగళవారం బాధితులకు అప్పగించారు. ట్రాఫిక్ సిఐ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 7న కోర్టు చౌరస్తాలో ఒక వ్యక్తి మోటార్ సైకిల్‌పైన నుంచి సుమారు రూ.2 వేల విలువ గల నిత్యావసర సరుకుల సంచి పడిపోయింది. అక్కడే విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది వాటిని కమాండ్ అండ్ కంట్రోల్ సీసీ కెమెరాల ద్వారా పరిశీలించారు. మోటార్ సైకిల్‌ని పరిశీలించగా కొత్త మోటార్ సైకిల్ రిజిస్ట్రేషన్ కాకపోవడంతో సంచిలో వెతుకగా అందులో పాత బిల్ చిట్టి ద్వారా అతని అడ్రస్ తెలుసుకొని బాధితుడికి ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ పి.ప్రసాద్, సిబ్బంది సంచిని అందించారు.

విద్యారంగాన్ని పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేయాలి

• టీయులో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలి

• ఎఐఎస్ఎఫ్ జాతీయ సమితి సభ్యులు బానోత్ రఘురాం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

రాష్ట్ర ప్రభుత్వ యూనివర్సిటీల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించి, టీచింగ్ , నాన్ టీచింగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ సమితి సభ్యులు బానోత్ రఘురాం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ యూనివర్సిటీలో మంగళవారం ఏఐఎస్ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బానోత్ రఘురాం మాట్లాడుతూ విద్యారంగాన్ని పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేయాలని, యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తిని కాపాడాలని, యూనివర్సిటీల అభివృద్ధి కోసం అధిక నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. అడ్మిషన్ పొందిన ప్రతి విద్యార్థికి ఉచితంగా మెస్, హాస్టల్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో యూనివర్సిటీ సమస్యలు పరిష్కరించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటన చేయాలని సూచించారు. సమస్యలను పరిష్కరించకుంటే విద్యార్థి సంఘాలను ఏకం చేసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర యూనివర్సిటీ కన్వీనర్ రెహమాన్, ఏఐఎస్ఎఫ్ తెలంగాణ యూనివర్సిటీ కన్వీనర్ సాయి, కో కన్వీనర్లు సంజయ్, చందు, గౌతమ్, మోక్షిత్, రవీందర్, విజయ్, భీమేష్, రాజేందర్, పాల్గొన్నారు.

ఉపాధ్యాయినికి వీడ్కోలు సమావేశం

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలంలోని తడపాకల్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయినిగా సేవలందించిన కవిత బదిలీలో భాగంగా వేరొక పాఠశాలకు వెళ్తున్న సందర్భంగా, మంగళవారం ఆమెను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. పాఠశాలకు ఆమె అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో తడపాకల్ ఉన్నత పాఠశాల హెచ్.ఎం.జావీద్, పీఆర్టీయూ మండలాధ్యక్షులు కృష్ణప్రసాద్, ఉపాధ్యాయులు చక్రపాణి, స్వప్న, విజయ, అజయ్, శ్రావణి, పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలి

• 4వ రోజు కొనసాగిన రిలే నిరసన దీక్ష

నవతెలంగాణ-కంఠేశ్వర్

సమగ్ర శిక్ష ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం అధ్యక్షులు రాజు తెలిపారు. రిలే నిరసన దీక్ష మంగళవారం నాటికి నాలుగవ రోజుకు చేరుకుంది. ఈ రిలే నిరసన దీక్షలకు టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు సురేష్ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు రాజు, టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు వెనిగళ్ళ సురేష్ మాట్లాడుతూ.. 15 సంవత్సరాలుగా విధులు నిర్వర్తిస్తు విద్యాశాఖలో కీలకంగా ఉంటూ విద్యాభివృద్ధికి తమ వంతు కృషి చేస్తున్నామన్నారు. రోస్టర్, మెరిట్, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికై ఉద్యోగ భద్రతకు అర్హత కలిగి ఉన్నామని అన్ని రకాల అర్హతలు ఉన్నప్పటికి నేటి వరకు మేము ఉద్యోగ భద్రతకు నోచుకోవడం లేదని తెలిపారు. (ఒడిశా, హర్యానా, ఢిల్లీ, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల్లో క్రమబద్ధీకరణ జరిగింది) కనీస వేతన స్కేలు అమలు చేయడం లేదని, ఉద్యోగ భద్రత, ఆరోగ్య, ప్రమాద భీమా సౌకర్యాలు కూడా లేవని అన్నారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు అశ్రఫ్ అలీ, వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్, ప్రధాన కార్యదర్శి భూపేందర్, కోశాధికారి ప్రసాద్, మహిళ అధ్యక్షురాలు గంగామణి, పెద్ద సంఖ్యలో సమగ్ర శిక్ష ఉద్యోగులు పాల్గొన్నారు.

పిట్ల ఎల్లన్న స్మారక సభను జయప్రదం చేయండి

నవతెలంగాణ-సిరికొండ

సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకుడు పిట్ల ఎల్లన్న 34వ స్మారక సభను గడ్కోల్ గ్రామంలో డిసెంబర్ 16న నిర్వహిస్తున్నామని ఏఐకేఎంఎస్ మండల అధ్యక్ష కార్యదర్శులు నిమ్మల భూమేశ్, పిట్ల ఎల్లయ్య తెలిపారు. మండల కేంద్రంలోని గడ్కోలులో కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పేదింటిలోపుట్టిన ఎల్లన్న, శ్రమజీవుల రాజ్యం కోసం రైతు కూలీ సంఘం నాయకుడిగా అనేక పోరాటాలకు నాయకత్వం వహించారని వారు తెలిపారు. సమాజ మార్పు కోసం పోరాడటమే ఎల్లన్నకు నిజమైన నివాళులు అన్నారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు, గులాం హుసేన్, సాకలి గంగాధర్, శివరాజ్, గొల్లరాములు, ఎర్రన్న, సుమన్, సాకలి రమేష్, నర్సయ్య, పీవైఎల్ మండల అధ్యక్షుడు మల్కీ సంజీవ్, అశోక్ పాల్గొన్నారు.

సెయింట్ పాల్ పాఠశాల పిఈటికి అభినందనలు

నవతెలంగాణ-ఆర్మూర్



71వ ఇంటర్ డిస్ట్రిక్ట్ మహిళా కబడ్డీ ఛాంపియన్షిప్ (సోనియా గాంధీ ఛాలెంజ్ ట్రోఫీ) ఈనెల 7 నుండి 10 వరకు ఎల్‌బి స్టేడియంలో నిర్వహించారు. ఈ సందర్భంగా టోర్నమెంట్‌కు టెక్నికల్ ఆఫీషల్‌గా పట్టణంలోని మామిడిపల్లి సెయింట్ పాల్ హై స్కూల్ పిఈటి ఆశల అనిల్ కుమార్ పాల్గొన్నారు. ఈసందర్భంగా పీఈటీని ప్రిన్సిపాల్ కాథరిన్ పాల్, కరెస్పాండెంట్ ఎంటక్ పాల్, వైస్ ప్రిన్సిపాల్ సిసిలియా అభినందించినట్టు పాఠశాల యజమాన్యం మంగళవారం తెలిపారు. చదువుతోపాటు ఆటల్లో విద్యార్థులను ముందు ఉంచడం అభినందనీయమని అన్నారు.

ఉపాధ్యాయునికి సన్మానం

నవతెలంగాణ-ఏర్గట్ల



ఏర్గట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భౌతిక రసాయన శాస్త్ర ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న గాండ్ల రాజశేఖర్ ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్-2024 లో పాల్గొని తన ప్రదర్శన ఇచ్చినందుకు గాను, ఈ నెల 6,7 తేదీల్లో నిజామాబాద్ జిల్లా కేంద్రంలో జరిగిన సైన్స్ ఎగ్జిబిషన్‌లో పాల్గొని రెండవ బహుమతి పొందినందుకు మంగళవారం పాఠశాల తరపున అతనిని సన్మానించినట్లు ప్రధానోపాధ్యాయులు కృష్ణాచారి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... ఉపాధ్యాయులు రాజశేఖర్ పాఠశాల నుండి జాతీయ స్థాయికి వెళ్ళడం గర్వకారణం అని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడలతోనే మానసిక ఉల్లాసం

- ఎంపిడిఓ లక్ష్మారెడ్డి, సిఐ కె. మల్లేష్.
- మండల స్థాయి సీఎం క్రీడా పోటీలు ప్రారంభం

నవతెలంగాణ-విలేకరులబృందం

డిచ్‌పల్లి : క్రీడ పోటీల్లో భాగస్వాములు కావడంతో శారీరక ధృడత్వంతోపాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని, పిల్లలు ఆటల పోటీల్లో పాల్గొని ఆటల్లో తమలో ఉన్న నైపుణ్యాన్ని చూపించి ఉన్నత స్థాయికి ఎదిగేందుకు ఇలాంటి అవకాశం కోసం ఎదురుచూడాలని అప్పుడే తనకు తాను ఎదగవచ్చని మండల పరిషత్ అభివృద్ధి అధికారి లక్ష్మారెడ్డి, డిచ్ పల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కే. మల్లేష్, తహసీల్దార్ వెంకటరావు, ఎంపీవోలు రాజ్ కాంత్ రావు , శ్రీనివాస్ గౌడ్ అన్నారు. సిఎం కప్ ఆటల పోటీల జెండా ఆవిష్కరించి జ్యోతిని వెలిగించి మండల స్థాయి క్రీడలను ఇందల్ వాయి మండలంలోని ఇందల్ వాయి, ఖిల్లా డిచ్ పల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ప్రారంభించారు. మండలంలోని వివిధ గ్రామాల నుండి వచ్చిన పాఠశాల విద్యార్థులు, యువకులు ముందుగా మార్చ్ పాస్ట్ చేశారు. అనంతరం ఆటల పోటీలను టాస్ వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి లక్ష్మారెడ్డి, డిచ్ పల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మల్లేష్ తదితరులు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో గ్రామస్థాయిలో క్రీడలు నిర్వహించడంతో గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న క్రీడాకారులు జిల్లా స్థాయికి, ఆతర్వాత రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఎంపిక కావడానికి ఇది వర్ణ అవకాశమని వారన్నారు. కార్యక్రమంలో డిసిసిబి డైరెక్టర్ కోరట్‌పల్లి ఆనంద్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మోత్కురి నవీన్ గౌడ్, సింగిల్ విండో చైర్మన్ గోవర్ధన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మండల విద్యాశాఖాధికారి శ్రీధర్, పిఆర్ ఏఈ గంగా కిరణ్, పంచాయతీ కార్యదర్శులు భారత్, శ్రీధర్, నాగేష్, వెంకటేశ్వర్లు, పి అశోక్,ఎంసూవర్ణ, అశ్వంత్, మహేష్, లావణ్యపిడి రాజేశ్వర్, పిటిలు పాల్గొన్నారు.

ఆర్మూర్ : మండల కేంద్రంలోని మినీ స్టేడియంలో సీఎం కప్ టోర్నమెంట్ పోటీలను మంగళవారం ఎంపీడీవో బాలకిషన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖోఖో, కబడ్డీ వాలీబాల్ బాస్కెట్‌బాల్, అథ్లెటిక్స్ విభాగాల్లో నిర్వహిస్తున్న క్రీడల్లో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొనాలని అన్నారు. ప్రారంభోత్సవ మ్యాచ్ వేల్పూర్, మోతె జట్ల మధ్య నిర్వహించారని తెలిపారు. ఈ



డిచ్‌పల్లిలో..

కార్యక్రమంలో మండల విద్యాధికారి రేణుక, ఎంపీఓ సాయిలు, ఏపీవో అశోక్, కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయుడు రాజన్న, ఫిజికల్ డైరెక్టర్లు మంచిర్యాల సురేష్ కుమార్, రాజేందర్, గంగారెడ్డి, రాజేశ్వర్, దేవ సుకన్య, సందీప్, వివిధ గ్రామాల పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి : మండల కేంద్రంలోని గ్రీన్ ఫీల్డ్ మినీ స్టేడియంలో మంగళవారం సీఎం కప్ మండల స్థాయి క్రీడలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. కమ్మర్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెపు నర్సయ్య ముఖ్యఅతిథిగా హాజరై సీఎం కప్ మండల స్థాయి క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో యువతను ప్రోత్సహించేందుకే తెలంగాణ రాష్ట్ర ప్రజాపాలన, ప్రజా విజయోత్సవాల్లో భాగంగా సీఎం కప్ క్రీడలను నిర్వహిస్తుందన్నారు. యువత క్రీడల్లో రాణించడం ద్వారా భవిష్యత్తులో పైకి ఎదగొచ్చు అన్నారు. అంతకు ముందు ఆయన క్రీడల పతాకాన్ని ఆవిష్కరించారు. క్రీడలను ప్రారంభించి, కీడాకారులను పరిచయం చేసుకున్నారు. సీఎం కప్ మండల స్థాయి క్రీడల్లో భాగంగా కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, ఖోఖో విభాగాల్లో క్రీడలను నిర్వహిస్తున్నట్లు మండల ఫిజికల్ డైరెక్టర్ నాగభూషణం తెలిపారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి సదాశివ్, మండల విద్యాధికారి ఆంధ్రయ్య, పంచాయతీ కార్యదర్శి గంగా జమున, ఆయా గ్రామాల ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సుంకెట రవి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

సిరికొండ : మండల స్థాయి సీఎం క్రీడా పోటీలు ప్రారంభించిన ఎంపీడీవో మనోహర్ రెడ్డి, ఎమ్మార్వో రవీందర్‌రావు ఘనంగా ప్రారంభించారు. తెలంగాణ ప్రభుత్వం ఆదేశానుసారం నిర్వహిస్తున్న క్రీడా పోటీలు మూడు రోజులపాటు జరుగుతాయని అన్నారు. ఈ మండల స్థాయి క్రీడోత్సవాల్లో పాల్గొంటున్న విద్యార్థులకు ఇది మంచి అవకాశమని అన్నారు. ఈ క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జిల్లా, రాష్ట్రస్థాయి క్రీడల్లో అవకాశం దక్కించుకునేందుకు సువర్ణ అవకాశమన్నారు

బాల్కొండ : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మండల అభివృద్ధి అధికారి విజయభాస్కర్‌రెడ్డి మండల స్థాయి సీఎం క్రీడా పోటీలు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేయాలన్న సంకల్పంతో గ్రామ స్థాయి నుంచి మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి క్రీడాకారులను తయారు చేయాలన్న లక్ష్యంతో ఈ క్రీడా కార్యక్రమాలు నిర్వహించినట్టు తెలిపారు. మారు మూల ప్రాంతాల్లో ఉండే క్రీడాకారుల ప్రతిభను గుర్తించి వారిని రాష్ట్ర, జాతీయ, ప్రపంచ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దే ప్రయత్నమే సీఎం కప్ ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి బట్టు రాజేశ్వర్, ఎంపీ ఓ గంగా మోహన్, మండల క్రీడా ఆర్గనైజర్ రాజ్ కుమార్, బాల్కొండ ఉన్నత పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు ప్రశాంత్‌కుమార్, బాల్కొండ గ్రామ ఈవో రజనీకాంత్ రెడ్డి, పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

మోపాల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో సీఎం కప్ పోటీలను ఎంపీడీవో రామన్ నాయక్, తహసీల్దార్ రామేశ్వర్ కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చదువుతోపాటు క్రీడలు కూడా ఎంతో ప్రాముఖ్యమని రాష్ట్ర ప్రభుత్వం క్రీడారంగానికి ఎంతగానో ప్రోత్సహిస్తుందని తెలిపారు. మన మండల క్రీడాకారులు జిల్లా రాష్ట్రస్థాయిలో కూడా తమ ప్రతిభను కనబరచాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈవో గేమ్ సింగ్, పంచాయతీ కార్యదర్శుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు గోవింద్, ఫిజికల్ డైరెక్టర్ ప్రమీల పాల్గొన్నారు.

మెండోర: మెండోర మండల కేంద్రంలో మండలకేంద్రంలో నిర్వహించిన మండల స్థాయి సిఎం కప్ పోటీలు ముగిశాయి. స్థానిక ఎంపిడిఓ వనజ ఆధ్వర్యంలో క్రీడపోటీలు ప్రారంభించి కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో బాలుర కబడ్డీలో ప్రథమ బహుమతి నడిమి తండ, ద్వితీయ బహుమతి మెండోర, వాలీబాల్‌లో ప్రథమ బహుమతి పోచంపాడ్, ద్వితీయ బహుమతి మెండోర, ఖోఖోలో ప్రథమ బహుమతి దుదిగాం, ద్వితీయ బహుమతి పోచంపాడ్ విద్యార్థులు గెలుపొందారు. బాలికల కబడ్డీ పోటీల్లో ప్రథమ బహుమతి మెండోర , ద్వితీయ బహుమతి పోచంపాడ్ విద్యార్థినిలు వాలీబాల్ పోటీలో ప్రథమ బహుమతి పోచంపాడ్ , ద్వితీయ బహుమతి మెండోర విద్యార్థినిలు, ఖో ఖో పోటీలో ప్రథమ బహుమతి దుదిగం, ద్వితీయ బహుమతి సోన్‌పెట్ విద్యార్థినిలు గెలుపొందారు. గెలుపొందిన విద్యార్థులకు ఎంపిడిఓ వనజ బహుమతులను అందజేశారు.

ధర్పల్లి : మండలకేంద్రములోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం మండల స్థాయి క్రీడలను ఎంపిడిఓ బాలకృష్ణ ప్రారంభించారు . ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ . ఈపోటీల్లో మండలంలోని అన్ని గ్రామాల ప్రభుత్వ పాఠశాలల్లోని బాలబాలికలకు కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, అథ్లెటిక్స్ నిర్వహించనున్నారని తెలిపారు. కార్యక్రమములో మండల విద్యాధికారి తోపాటు మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పిడిలు , పీఈటీలు ,విద్యార్థులు పాల్గొన్నారు .



మెండోరలో..



ధర్పల్లిలో..



బాల్కొండ: క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అధికారి



కమ్మర్‌పల్లిలో..

ఆశావర్కర్లపై దాడులు చేయడం సిగ్గుచేటు

నవతెలంగాణ-ఆర్మూర్

తమ సమస్యల పరిష్కారానికై హైదరాబాదులో ఆందోళన చేసిన ఆశ వర్కర్లపై దాడులు చేయడం సిగ్గుచేటని నియోజకవర్గ బిజెపి అసెంబ్లీ కన్వీనర్ స్వాభావిక గౌడ్ సోమవారం ధ్వజమెత్తారు. వేతనలు 9వేల నుండి 18 వేల వరకు పెంచుతామని, గత ప్రభుత్వం మాట నిలబెట్టుకోలేదని, గత సంవత్సరం కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మహిళలపై దాడులు. అట్రాసిటీ కేసులు నమోదు అవుతున్న పట్టించుకోవడం లేదని అన్నారు. అసభ్యంగా ప్రవర్తించి, భౌతిక దాడులకు దిగిన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

ఆశా కార్యకర్తల అరెస్టులు

- బీఆర్ఎస్ నాయకుల సంఘీభావం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

డిచ్‌పల్లి, ఇందల్‌వాయి మండలాలకు చెందిన ఆశా కార్యకర్తలు తమ డిమాండ్ల అమలుకు చలో హైదరాబాద్ నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారనే సమాచారం మేరకు పోలీసులు అప్రమత్తమై ముందస్తుగా ఆశా కార్యకర్తలను అరెస్టు చేసి డిచ్‌పల్లి, ఇందల్‌వాయి పోలీస్ స్టేషన్‌లకు తరలించారు. ఈ సందర్భంగా మండల అశా కార్యకర్తల అధ్యక్షురాలు బోడికే స్వప్న మాట్లాడుతూ.. తమ సమస్యల పరిష్కారానికి చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్లేందుకు ప్రయత్నాలు చేస్తుండగా పోలీసులు ముందస్తుగా అరెస్టు చేయడం ఎంతవరకు సమంజసని ప్రశ్నించారు. పాలకులు ఇచ్చిన హామీ ని నేరవేర్చాలని, కాని ఉద్యమాలను అనిచివేస్తే రాబోయే రోజుల్లో ప్రత్యక్ష యుద్ధం చేయాల్సి వస్తుందని అన్నారు. డిమాండ్లను ప్రభుత్వం పరిశీలించాల్సింది పోయి, ఇచ్చిన హామీలకు తూట్లు పొడుస్తూన్నారని అన్నారు. అరెస్టు చేయించి బెదిరింపులకు పాల్పడితే ఊరుకోమని ఇప్పటికైన న్యాయమైన డిమాండ్ లను నేరవేర్చాలని డిమాండ్ చేశారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలి

- సిపిఐ(ఎం) పార్టీ జిల్లా కార్యదర్శి రమేష్ బాబు



తహసీల్దార్ కార్యాలయంవద్ద ధర్నా చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-నవీపేట్

ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారంటీలను అమలు చేయాలని తహసిల్దార్ కార్యాలయం ముందు సిపిఐ(ఎం) పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి తాహసిల్దార్ వెంకటరమణకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తి చేసుకొని సంబరాలు చేసుకుంటున్నారని, కానీ పేద ప్రజల సమస్యలు పరిష్కరించడంలో విఫలం అయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలకు 2500, కౌలు రైతులకు, వ్యవసాయ కూలీలకు 12వేలు ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి 5 లక్షల హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న సందర్భంగా ఇచ్చిన హామీలను పరిష్కరించే విధంగా చూడాలని హెచ్చరించారు. లేకుంటే భవిష్యత్తులో జరిగే పోరాటాలకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి నాయక్ వాడి శ్రీనివాస్, షేక్ మహబూబ్, సావిత్రి, నస్రీన్, షమీం,రమాదేవి, మంజుల పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆంగ్ల డిక్షనరీలు పంపిణీ

నవతెలంగాణ-ముప్కాల్

ముప్కాల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రెంజర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం రోజున ఆంగ్ల డిక్షనరీలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ జిల్లా అధ్యక్షులు సాగర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు డిక్షణిరిలను చదవడం వల్ల విలువైన విషయాలు తెలుసుకోని పురోగతిని పొందుతారని అన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు చాకు లింగం, పోతూ ప్రసాద్, స్థానిక పాఠశాల ఉపాధ్యాయులు రవి, సామ ప్రసాద్, దేవసహాయం, మోహన్, మదర్, మురళి, గంగాధర్, శ్రీనివాస్, గోపి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు..

6వ అంతస్తు నుంచి దూకి వ్యక్తి ఆత్మహత్య



నవతెలంగాణ-కంఠేశ్వర్

నగరంలోని ఓ వ్యక్తి మానసిక ఇబ్బందులు తాళలేక ప్రభుత్వాసుపత్రి ఆరవ అంతస్తు నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని నాగారం ప్రాంతానికి చెందిన మట్ల లక్ష్మణ్ (50) అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. అనారోగ్యంతోపాటు మానసికంగా ఇబ్బందులు పడుతున్న లక్ష్మణ్ చికిత్స నిమిత్తం జీజీహెచ్‌లో చేరినట్లు తెలిసింది. మానసికంగా ఇబ్బందులు పడుతున్న లక్ష్మణ్ మంగళవారం ఆస్పత్రిలోని ఆరో అంతస్తు నుంచి దూకడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిసింది. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలను సేకరించారు.

అథ్లెటిక్స్‌లో ఓవరాల్ ఛాంపియన్‌గా నియోలిటిటల్ ఫ్లవర్ హైస్కూల్

- 30మెడల్స్ కైవసం
- మండల స్థాయిలో పోటీల్లో ప్రతిభ



మెడల్స్ గెలుచుకున్న విద్యార్థులు

నవతెలంగాణ-నిజామాబాద్(నంది పేట్)

ఈనెల 9న ట్రస్మా నందిపేట్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన మండల్ లెవెల్ అథ్లెటిక్స్ ఛాంపియన్షిప్స్-2024 అండర్ 8,10,12, 14 బాలురు, బాలికలు 30 మెడల్స్ సాధించి మండలంలో ఓవరాల్ ఛాంపియన్‌గా నియో లిటిల్ ఫ్లవర్ హై స్కూల్ నిలిచింది. 13 గోల్డ్ మెడల్, 10 సిల్వర్ మెడల్స్, 07 బ్రాంజ్ మెడల్‌స పలు కేటగిరిల్లో విద్యార్థులు మెడల్స్ సాధించారని కరస్పాండెంట్ అరుణ్ సార్, ప్రిన్సిపాల్ రవికిరణ్, ఉపాధ్యాయులు కలిసి విద్యార్థులను, వ్యాయామ ఉపాధ్యాయులు వికాస్, నవీన్‌ను అభినందించారు. ఈసందర్భంగా అరుణ్ మాట్లాడుతూ.. తెలంగాణలో మొదటిసారి జరిగిన ఈ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్ స్ఫూర్తిగా తీసుకుంటూ మరో నిఖత్ జరీనా లాంటి క్రీడాకారులు తయారవ్వాలని విద్యార్థులకు సూచించారు.

లక్ష్యసాధన దిశగా కృషి చేయాలి

- జిల్లా కోర్టు ప్రిన్సిపల్ సెషన్స్ జడ్జి సునీత

నవతెలంగాణ-కంఠేశ్వర్/నిజామాబాద్‌సిటీ

విద్యార్థినులు ఉన్నత లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని ఆ దిశగా విద్యాభ్యాసం చేయాలని నిజామాబాద్ జిల్లా కోర్టు ప్రిన్సిపల్ సెషన్స్ జడ్జి సునీత కుంచాల అన్నారు. మంగళవారం అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా నిజామాబాద్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో జిల్లా న్యాయ సేవ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సమావేశానికి కళాశాల ప్రిన్సిపల్ బుద్ధిరాజు అధ్యక్షత వహించగా, అతిథిగా జిల్లా ఇంటర్ విద్య అధికారి తిరుమలపుడి రవికుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కోర్టు ప్రిన్సిపల్ సేషన్స్ జడ్జి సునీత మాట్లాడుతూ విద్యార్థినులు విద్యను అభ్యసించడం తమ హక్కు అని, ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని ఆ దిశగా భవిష్యత్తు విద్యాభ్యాసాన్ని చేస్తూ తాను అనుకున్నది సాధించాలని ఉద్బోధించారు. ప్రతి మహిళా ఉన్నతంగా తమ జీవితాన్ని తీర్చిదిద్దుకోవడం విద్యార్థి దశనుండే అలవర్చుకోవాల్సి ఉంటుందని అన్నారు. అన్నిటికి మూలం విద్యాభ్యాసమేనని, అన్ని రంగాలలో మహిళలు ముందు ఉండాలని, ఉచిత న్యాయ సహాయం కూడా పొందవచ్చు అని అన్నారు. జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి మాట్లాడుతూ.. విద్యార్థి దశలోనే హక్కుల గురించి తెలుసుకోవాలని అన్ని విషయాల్లో జిల్లా న్యాయ సేవా సంస్థ మహిళలకు హక్కుల పరిరక్షణ కోసం న్యాయ సేవ అందించేందుకు కృషి చేస్తుందని అన్నారు. ఏ అన్యాయం జరిగినా న్యాయ సేవా సంస్థ ఉచిత న్యాయ సహాయం చేస్తుందని అన్నారు. రాజ్యాంగం ప్రకారం ప్రతి ఒక్కరూ విద్యార్థి దశనుండే హక్కులతో పాటు విధులను కూడా సక్రమంగా నిర్వర్తించాలని ఉద్బోధించారు.

జిల్లా ఇంటర్ విద్య అధికారి తిరుమలపుడి రవికుమార్ మాట్లాడుతూ సమాజాభివృద్ధికి విద్యార్థి దశ నుండి బాధ్యతయుతంగా వ్యవహరించాలని అన్నారు. ప్రతి మహిళ, విద్యార్థినీ ఏ అన్యాయం జరిగినా ఉచిత న్యాయ సహాయం పొందడానికి జిల్లా న్యాయ సేవా సంస్థను సంప్రదించాలని విద్యార్థినులకు సూచించారు. సమాజంలో ఉన్న రుగ్మతలను నిర్మూలించడానికి మహిళల పట్ల జరుగుతున్న అణచివేత, అకృత్యాలను, నిర్మూలించేందుకు విద్యార్థినులు, యువతులు జాగరూకతతో వ్యవహరించాలని ఉద్బోధించారు. ప్రిన్సిపాల్ బుద్ధిరాజు మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులకు జిల్లా న్యాయ సేవ సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కల్పించి హక్కులను పొందే విధంగా కృషి చేయడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు.



మాట్లాడుతున్న జడ్జి సునీత



అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

నవతెలంగాణ-సిరికొండ

మండలంలోని జినిగ్యాల గ్రామ ప్రజలకు అడవికి నిప్పు, వాటి నివారణ చర్యల గురించి అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. అటవీ ఉపక్షేత్రాధికారి గంగారాం. అడవిలో అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవలసిన చర్యల గురించి, అలాగే అగ్ని ప్రమాదాలు జరిగితే వన్యప్రాణులకు, అడవిలోని చెట్లకు జరిగే నష్టాల గురించి అవగాహన కల్పించారు.

IN THE COURT OF THE HON'BLE FIRST ADDITIONAL DISTRICT JUDGE AT NIZAMABAD
L.A. No. 936 of 2023
In
A.S. No. 27 of 2023

Between:-
Mohd. Abdul Sattar and others.
..Petitioners/Appellants/Plaintiffs 1, 3, 4 and 5
AND
P. Rajeshwer (Died) hence through his LR's and others
...Respondents/Defendants/Plaintiff No.2.

To,
Respondent No.5- Smt. Padma w/o Late P.Rajeshwer Reddy, aged about 75 years, Occu:-House wife r/o H.No.1-131, Kotarmur, Perkit village, Armoor (M), Dist:-Nizamabad now r/o Hyderabad. (LR of the deceased first defendant).
Respodnent No.6- Smt. Shakunthala w/o Krishna (D/o Late P.Rajeshwer Reddy, aged about 52 years, Occu:-House wife r/o H.No.1-131, Kotarmur, Perkit village, Armoor (M), Dist:-Nizamabad (LR of deceased first defendant)

Whereas the above named petitioner/Plaintiff has filed an application for granting temporary injunction against you. You are hereby warned to appear before this Hon'ble court on **11-12-2024 at 10-30 "O' clock** in the forenoon, to show cause against the said application, and failing which, the application will be heard ad determined in your absence in exparte.

// BY THE ORDER OF THE COURT //
Gajawada Tulasidas
G. Jhansi Rani
Advocates, Nizamabad
Cell.No.94406-33391

IN THE COURT OF THE HON'BLE FIRST ADDITIONAL DISTRICT JUDGE AT NIZAMABAD
L.A. No. 937 of 2023
In
A.S. No. 27 of 2023

Between:-
Mohd. Abdul Sattar and others.
..Petitioners/Appellants/Plaintiffs 1, 3, 4 and 5
AND
P.Rajeshwer Reddy (Died) hence through his LR's and others.
..Respondents/Defendants/Plaintiff No.2.

To,
Respondent No.5- Smt.Padma w/o Late P.Rajeshwer Reddy, aged about 75 years, Occu:-House wife r/o H.No.1-131, Kotarmur, Perkit village, Armoor (M),Dist:-Nizamabad now r/o Hyderabad. (L.R of the deceased first defendant)
Respodnent No.6- Smt. Shakunthala w/o Krishna (D/o Late P.Rajeshwer Reddy, aged about 52 years, Occu:-House wife r/o H.No.1-131, Kotarmur. Perkit village, Armoor (M), Dist:-Nizamabad (LR of deceased first defendant)

Whereas the above named petitioner/Plaintiff has filed an application for granting temporary injunction against you. You are hereby warned to appear before this Hon'ble court on **11-12-2024 at 10-30 "O' clock** in the forenoon, to show cause against the said application, and failing which, the application will be heard ad determined in your absence in exparte.

// BY THE ORDER OF THE COURT //
Gajawada Tulasidas
G. Jhansi Rani
Advocates, Nizamabad
Cell.No.94406-33391

NOTICE TO SHOW CAUSE IN AN APPEAL
IN THE COURT OF THE HON'BLE FIRST ADDITIONAL DISTRICT JUDGE AT NIZAMABAD
A.S. No. 27 of 2023

Between:-
Mohd. Abdul Sattar and others.
... Appellants/Plaintiffs 1, 3, 4 and 5
AND
P. Rajeshwer Reddy (Died) hence through his LR's and others
..Defendants/Plaintiff No.2.

To,
Respondent No.5- Smt.Padma w/o Late P.Rajeshwer Reddy, aged about 75 years, Occu:-House wife r/o H.No.1-131, Kotarmur, Perkit village, Armoor (M), Dist:-Nizamabad now r/o Hyderabad. (LR of the deceased first defendant)
Respodnent No.6- Smt. Shakunthala w/o Krishna (D/o Late P.Rajeshwer Reddy, aged about 52 years, Occu:-House wife r/o H.No.1-131, Kotarmur, Perkit village, Armoor (M), Dist:-Nizamabad (LR of deceased first defendant)

Whereas the above named petitioners/Plaintiffs have filed an appeal before this court against the Judgment and Decree in O.S. No. 44 of 2013 by the honorable court of Senior Civil Judge, Armoor against you. You are hereby warned to appear before this Hon'ble court on **11-12-2024 at 10-30 "O' clock** in the forenoon, to show cause against the said application, and failing which, the application will be heard ad determined in your absence in exparte.

// BY THE ORDER OF THE COURT //
Gajawada Tulasidas
G. Jhansi Rani
Advocates, Nizamabad
Cell.No.94406-33391